MAHANAGAR DINAPATRIKA

# మహానగర్

విజయవాడ | సంపుటి : 8 | సంచిక : 248 | పేజీలు : 8 | శనివారం 27 జూలై 2024 | వెల : 6-00



## పాకిస్థాన్ ఆట కట్టిస్తాం


- గతం నుంచి అది ఏమీ నేర్చుకోలేదు
- దాయాది ఉగ్ర కుట్రలు అణచివేస్తాం
- ఆర్మీలో గొప్ప సంస్కరణ అగ్నిపథ్
- యుద్ధ సన్నద్ధతా పెరిగింది: మోదీ
- కార్గిల్ విజయ్ దివస్‌కు పాతికేళ్లు
- ద్రాస్‌లో సైనికులతో గడిపిన ప్రధాని
- ఆర్మీ మీద రుద్దిన స్కీమ్ అగ్నిపథ్
- కార్గిల్‌పైనా రాజకీయాలా

ద్రాస్ (లద్దాఖ్), మహానగర్

దాయాది పాకిస్థాన్ ఉగ్ర కుట్రలను సైన్యం తిప్పికొడుతుందని ప్రదాన మంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. "ఉగ్రవాద ఘాతుకాలు, దొంగ యుద్ధాలతో కవ్వింపు చర్యలకు పాకిస్థాన్ పాల్పడుతూనే ఉంది. దాని ఆట కట్టిస్తాం. ముష్కరుల దుశ్చర్యలను అణచి వేస్తాం" అంటూ తీవ్ర స్వరం వినిపించారు. భారత వీర జవాన్ల శౌర్యానికి ప్రతీకగా నిలిచిన కార్గిల్ యుద్ధానికి నేటితో పాతికేళ్లు. విజయ్‌దివ్‌సగా ఈ సందర్భాన్ని భారతావని శుక్రవారం ఘనంగా జరుపుకొంది. ఆ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన అమర జవాన్లకు, ఆ యుద్ధం జరిగిన కార్గిల్ - మిగతా 2లో

# ఏపీ.. అప్పుల కుప్ప

- మొత్తం రుణాలు రూ.9.74 లక్షల కోట్లు
- ఏడాదికి చెల్లించాల్సిన అసలు, వడ్డీ 71,881 కోట్లు
- 100 ఆదాయానికి రూ.113 ఖర్చు
- పెండింగ్ బిల్లులు 1.35 లక్షల కోట్లు
- అడ్డగోలుగా అప్పులు.. ప్రభుత్వ ఆస్తుల తాకట్టు
- ప్రజలపై చార్జీలు, పన్నుల బాదుడు
- 33 ప్రభుత్వ శాఖల నుంచి నిధుల మళ్లింపు
- పోలవరంపై నిర్లక్ష్యంతో 53 వేల కోట్ల నష్టం
- అమరావతి ధ్వంసంతో 2-3 లక్షల కోట్ల ఆస్తి ఆవిరి
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో శ్వేతపత్రం
- ఇంకా సమాచారం రావాల్సి ఉందని సీఎం వ్యాఖ్య



అమరావతి, మహానగర్

జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి జాడే లేదు. పాత పథకాలకే పేర్లు, అమలు తీరు మార్చి 'బటన్' నొక్కడం మినహా పెద్దగా చేసిందేమీ లేదు. అయినా అడ్డగోలుగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మొత్తం అప్పులు రూ.9.74 లక్షల కోట్లు! తేలాల్సిన లెక్కలు ఇంకా చాలా ఉన్నాయి. జగన్ ఐదేళ్ల విధ్వంసకర పాలనలో భారీగా జరిగిన ఆర్థిక నిర్వహణ లోపాలపై శుక్రవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఇంకా తవ్వాల్సినవి ఉన్నాయని, పూర్తి సమాచారం రాలేదని తెలిపారు. అప్పులు, బకాయిల వివరాలు అసలూ వడ్డీ చెల్లింపులు, పెండింగ్ బిల్లులు తదితర వివరాలు వెల్లడించారు. పెండింగ్ బిల్లులు మొత్తం రూ.1.35 లక్షల కోట్లు ఉన్నాయని చంద్రబాబు వెల్లడించారు. 2024-25లో అప్పుల అసలు, వడ్డీ కలిపి రూ.71,881 కోట్లు చెల్లించాలని తెలిపారు. విభజన నష్టాలు, ఆ తర్వాత టీడీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందిన తీరు, 2019 తర్వాత వైసీపీ హయాంలో రాష్ట్రం వెనుకబడ్డ తీరును చంద్రబాబు వివరించారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజలు సలహాలు ఇవ్వాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అరాచకాలు, ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చంద్రబాబు మాటల్లోనే... విభజన తర్వాత తలసరి ఆదాయం ఏపీలో రూ.93,903కు తగ్గింది. తెలంగాణలో ఒక్కసారిగా రూ.1,24,104కు చేరుకుంది. తర్వాతి ఐదేళ్లూ తెలంగాణతో సమానం అయ్యేందుకు ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పించే ప్రయత్నం చేశాం. పట్టిసీమ లిఫ్ట్ వల్ల ఇరిగేషన్‌కు - మిగతా 2లో

## సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చారు

- ప్రజలు ప్రశ్నించకుండా ఉండేందుకు ప్రత్యర్థులను బెదిరిస్తున్నారు
- హామీలు ఆమలు చేయాలని బడ్జెట్ పెట్టడం లేదు
- ఏపీకి ఉన్న మొత్తం అప్పులు రూ.7.48 లక్షల కోట్లు అని వెల్లడి
- సాధారణ బడ్జెట్ అయితే... ఎన్నికల సమయంలో ఇచ్చిన మోసపూరిత హామీలన్నింటిని చూపించాల్సి వస్తుందని
- అందుకే 7 నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతున్నారని
- చంద్రబాబు చెప్పిందే ఎల్లోమీడియాకు వేదం



అమరావతి, మహానగర్

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ నేడు తాడేపల్లిలో ప్రత్యేకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. చంద్రబాబు అంటేనే వంచన, తప్పుడు ప్రచారం అని అభివర్ణించారు. అందుకే ఇప్పుడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అంటున్నారని ధ్వజమెత్తారు. సాధారణ బడ్జెట్ అయితే... ఎన్నికల సమయంలో ఇచ్చిన మోస పూరిత హామీలన్నింటిని చూపించాల్సి వస్తుందని, అందుకే 7 నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతున్నారని జగన్ ఆరోపించారు. చంద్రబాబు గోబెల్స్ సిద్ధాంతాన్నే నమ్ముకున్నారని, - మిగతా 2లో

सत्यमेव जयते
NITI Aayog

## నేడే నీతి ఆయోగ్ భేటీ

- సమావేశాన్ని బహిష్కరించాలని ఇండియా కూటమి సీఎంల నిర్ణయం
- హాజరు కాబోనని ఇప్పటికే ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- భేటీకి హాజరై బెంగాల్ విభజన ప్రతిపాదనపై నిలదీస్తానని మమత వెల్లడి
- నీతి ఆయోగ్‌ను రద్దు చేసి ప్రణాళికా సంఘాన్ని పునరుద్ధరించాలని డిమాండ్
- పాల్గొననున్న ఏపీ సీఎం చంద్రబాబు.. హేమంత్ సోరెన్ హాజరుపై అనిశ్చితి

న్యూఢిల్లీ, మహానగర్

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 9వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం శనివారం జరగనుంది. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ భేటీలో - మిగతా 2లో

## వరద బాధిత కుటుంబాలకు రూ.3000 తక్షణ సాయం

- 25 కిలోల బియ్యం, కిలో చొప్పున నిత్యావసర సరుకుల పంపిణీ
- నిబంధనలకన్నా ఎక్కువ పరిహారమే అందజేస్తాం
- శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన
- బాధితులకు అండగా ఉండాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆదేశం



అమరావతి, మహానగర్

గోదావరి వరద బాధిత కుటుంబాలకు రూ.3,000 చొప్పున నగదు, 25 కిలోల బియ్యంతోపాటు కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు కిలో చొప్పున, ఒక లీటరు పామాయిలు కూడా తక్షణ సాయంగా అందజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం శాసనసభలో ప్రకటించారు. ఇళ్లలోకి వరద నీరు చేరి, పునరావాస కేంద్రాల్లో ఉంటున్నవారందరికీ ఈ తక్షణ సాయం అందుతుందని తెలిపారు. గోదావరి వరదల వల్ల ఆయా జిల్లాల్లో వాటిల్లిన - మిగతా 2లో

## ఏపీకి అదనపు ఐపీఎస్‌లు

- కేడర్ స్ట్రెంత్ పెంచిన కేంద్ర హోంశాఖ
- ఐపీఎసల సంఖ్య 144 నుంచి 174కు పెంపు
- సీఎం చంద్రబాబు విన్నపంపై కేంద్రం స్పందన
- విభజన తర్వాత అదనపు కేటాయింపు ఇప్పుడే!ఖ



అమరావతి, మహానగర్

రాష్ట్రానికి భారీగా కొత్త ఐపీఎసలు రాబోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు చేసిన అభ్యర్థన మేరకు కేంద్రం స్పందించి ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 144 మంది ఐపీఎసలను కేటాయించారు. అయినప్పటికీ పోలీసుల కొరత మాత్రం తీరలేదు. పైగా విభజన తర్వాత ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలు చేసింది. దీంతో పాటు నిఘా వ్యవస్థ విభాగాల్లో, క్రైం విభాగాల్లో పోలీసు అధికారుల కొరత తీవ్రంగా ఉంది. విభజన తర్వాత ఐపీఎసల కొరతను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం తమకు పోలీసు సిబ్బందిని ఎక్కువ మందిని కేటాయించాలని కేంద్రాన్ని కోరినా ఫలితంలేకపోయింది. జగన్ కూడా కేంద్రానికి లేఖ రాశారు. అయితే, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేకసార్లు - మిగతా 2లో

## విద్యా కానుక కొనసాగిస్తాం

- గత ప్రభుత్వంలో విద్యాకానుక నిధుల దుర్వినియోగం
- శాసన మండలిలో విద్యాశాఖ మంత్రి లోకేశ్



అమరావతి, మహానగర్

రాష్ట్రంలో విద్యాకానుక పథకాన్ని కొనసాగిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు. అమరావతి సచివాలయంలోని శాసన మండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానం చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో విద్యా కొనుగోళ్లలో అక్రమాలు - మిగతా 2లో

# పాకిస్థాన్ ఆట కట్టిస్తాం

-మొదటిపేజీ తరువాయి

ప్రాంతంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాళులు అర్పించారు. విధుల్లో ఉన్న సైనికులతో కలిసి విజయ్‌దివస్‌ను జరుపుకొన్నారు. అక్కడ ఏర్పాటుచేసిన కార్గిల్ యుద్ధ స్మారకాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌కు మోదీ గట్టి హెచ్చరిక చేశారు. జమ్మును కేంద్రం చేసుకుని గత నెల రోజుల్లోనే ఉగ్రవాదులు ఆరుకు పైగా భారీ దాడులు చేశారు. ఈ నేపథ్యంలో మోదీ తీవ్రంగా స్పందించారు. "పాక్ చరిత్ర అంతా ఓటములతో నిండిపోయింది. అయినా ఇప్పటికీ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. వారి నీచ ఉద్దేశ్యాలు ఏనాటికీ నెరవేరవు. ఉగ్రవాద పోషకులు కూడా వినగలిగే చోటులో నిలబడి నేను ఈ మాట చెబుతున్నాను" అని హెచ్చరించారు.

అసత్య కథనాలు, ఉగ్రవాద ఉన్మాదంపై సత్యం సాధించిన విజయమే కార్గిల్ యుద్ధమని మోదీ అభివర్ణించారు. కార్గిల్‌లో భారత్ యుద్ధాన్ని మాత్రమే గెలవలేదని, తిరుగులేని తన సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, అసాధారణ రీతిలో సత్యాన్ని ఆవిష్కరించిందని మోదీ అన్నారు. కాగా, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్... కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. వారి త్యాగాలు వృథా కాబోవన్నారు. కాగా, పార్లమెంటులో సభ్యులు కార్గిల్ అమరవీరుల కోసం మౌనం పాటించారు. వారి మహోన్నత త్యాగాలకు దేశం రుణపడి ఉంటుందని రాహుల్‌గాంధీ అన్నారు.


**అగ్ని వీరులకు ఉద్యోగాలు**

ప్రధాని మోదీ అభిలాష మేరకు అగ్నివీరులుగా పనిచేసి వచ్చిన వారికి పోలీసు, ప్రాదేశిక సైనిక దళాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తాజాగా బీజేపీ పాలిత ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ప్రకటించాయి. ఛత్తీసగఢ్, ఒడిశా సైతం అగ్నివీరులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయి. హరియాణా ఇదివరకే ఈ తరహా ప్రకటన చేసింది.

**అగ్నిపథ్.. గొప్ప సంస్కరణ**

అగ్నిపథ్ పథకంపై విపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రధానమంత్రి మోదీ తిప్పికొట్టారు. జవాన్లను యుద్ధ సన్నద్ధులను చేయడానికి ఈ పథకం ఎంతగానో తోడ్పడిందన్నారు. యువసేనగా ఆర్మీని మార్చాలని దశాబ్దాలుగా పార్లమెంటులో, వివిధ కమిటీల్లో జరుగుతున్న చర్చలు అగ్నిపథ్ రూపంలో సాకారం అయ్యాయన్నారు. ఆర్మీలో సేవలు అందిస్తున్న జవాను వయసు ప్రపంచవ్యాప్త వయోసగటుతో పోల్చితే భారత్‌లోనే నిన్నటివరకు అధికంగా ఉండేదని గుర్తు చేశారు. ఎంతగానో బాధిస్తున్న ఈ సమస్యను గుర్తించి, దానిపై ముఖ్యమైన సంస్కరణను సైన్యం చేపట్టిందన్నారు. అయినా, జాతీయ భద్రతతో ముడిపడిన ఇటువంటి సున్నితమైన అంశంపైనా కొందరు రాజకీయం చేస్తున్నారని, స్వప్రయోజన కాంక్షతో అబద్ధాలు వల్లిస్తున్నారని మోదీ మండిపడ్డారు. కాగా, అగ్నిపథ్‌పై మోదీ వ్యాఖ్యలను విపక్షాలు తప్పుబట్టారు. కార్గిల్ విజయ దివస్ నాడు కూడా మోదీ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. ఆర్మీ కోరితేనే కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని అమలు చేస్తోందన్న రీతిలో మోదీ వ్యాఖ్యలు ఉన్నాయని, ఇది పచ్చి అబద్ధమన్నారు. శౌర్య జవానులకిది మరిచిపోలేని అవమానమని మండిడ్డారు. ఈ పథకాన్ని రద్దు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. అగ్నిపథ్‌ను సైన్యానికి తెలియకుండా హఠాత్తుగా కేంద్రం ప్రవేశపెట్టిందని కాంగ్రెసకు చెందిన మరో నేత జైరామ్ రమేశ్ విమర్శించారు. ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ఈ పథకాన్ని ఏకపక్షంగా తెచ్చారని అదే పార్టీకి చెందిన ఎంపీ వివేక్ టంఖా అన్నారు.

# ఏపీ.. అప్పుల కుప్ప



-మొదటిపేజీ తరువాయి

రూ.44,000 కోట్ల ఆదాయం వచ్చింది. పోలవరం కోసం రూ.15,364 కోట్లు ఖర్చు చేశాం. 2019లో కూడా మేము అధికారంలోకి వచ్చుంటే ఇప్పటికే అమరావతి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా మారి ఉండేది. 7 లక్షల మంది ఉద్యోగులు అమరావతిలో ఉండేవారు. 3 నుంచి 4 లక్షల కోట్ల ఆస్తి అమరావతితో వచ్చేది. 2014-19 మధ్య తలసరి ఆదాయం 13.2శాతం పెరిగింది. ఇప్పుడు విద్యుత్ రంగంలోనే అప్పులు రూ.1.29 లక్షల కోట్లకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు మళ్లించారు. విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, పన్నులు, ఇసుకపై పన్నులు పెంచారు. ప్రస్తుతం అప్పు రూ.9.74 లక్షల కోట్లకు చేరింది. తలసరి అప్పు రూ.1,44,336కు చేరింది. టీడీపీ హయాంలో ఇది రూ.74,790గా ఉండేది.

**డబ్బులు ఊడ్చేశారు**

గత ప్రభుత్వంలో 33 ప్రభుత్వ శాఖల నుంచి డబ్బులు లాగేశారు. ఎన్టీయార్ హెల్త్ యూనివర్సిటీ నుంచి రూ.400 కోట్లు తీసుకున్నారు. విశాఖలో ప్రభుత్వ భవనాలు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. మిగిలిన భూములను కబ్జా చేశారు. వీటి విలువ రూ.40,000 కోట్లు. అభయహస్తం కింద ఉన్న డ్వాక్రా మహిళల డబ్బును కూడా కొట్టేశారు. కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఐఏఎసలు, సీఎస్ కోర్టు ముందుకెళ్లి సంజాయిషీ చెప్పుకోవాల్సి వచ్చింది. కొందరికి జైలు శిక్ష కూడా పడింది. పెండింగ్ బిల్లులు రూ.1.35 లక్షల కోట్లుగా తేలాయి.

**500 కోట్లతో రుషికొండ ప్యాలెస్**

ఒక్క వ్యక్తి ఆనందం కోసం రూ.500 కోట్లతో విశాఖ రుషికొండలో ప్యాలెస్ కట్టారు. ఈ 500 కోట్లు టూరిజంలో ఖర్చు చేస్తే వేలకోట్ల ఆదాయం వచ్చేది. నేను 14 ఏళ్లు సీఎంగా ఉన్నాను. కానీ, ఈ తరహాలో ప్యాలెస్ కట్టాలన్న ఆలోచన ఎన్నడూ రాలేదు.

**విధ్వంసాన్ని ప్రతిబింబించిన శ్వేత పత్రాలు**

మొత్తంగా ఏడు అంశాలపై విడుదల

వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో చోటు చేసుకొన్న ఆర్థిక, సామాజిక విధ్వంసంపై కొత్త ప్రభుత్వం మొత్తంగా ఏడు శ్వేతపత్రాలు విడుదల చేసింది. ఆయా అంశాల్లో పరిస్థితులను ప్రజల ముందుంచేందుకు వీలుగా శ్వేతపత్రాలను ప్రకటిస్తామని చంద్రబాబు ముందే ప్రకటించారు. అమరావతి, పోలవరం, విద్యుత్తు, సహజ వనరులు, మద్యం, శాంతి భద్రతలు, ఆర్థికంపై వాస్తవాలను ప్రజలముందుంచారు. వీటిలో... నాలిగింటిని విలేకరుల సమావేశాల్లో, మిగిలిన మూడింటిని అసెంబ్లీ వేదికపై విడుదల చేశారు. అయితే... అధికార వర్గాల నుంచి ఇంకా పూర్తి సమాచారం రాలేదని ముఖ్యమంత్రి చంద్రబాబే పేర్కొన్నారు. సహజ వనరులకు జరిగిన దోపిడీలో సంబంధిత శాఖల నుంచి సమాచారం రాబట్టడానికి ఉన్నతాధికారులు చాలా శ్రమించాల్సి వచ్చింది. ఆర్థిక శాఖలో పెండింగ్ బిల్లుల సమాచారం రాబట్టడం కొత్త ప్రభుత్వానికి తలకుమించిన భారమైంది.

జగన్ నిర్వాకంతో నష్టాలు

ఐదేళ్లలో మూలధన వ్యయం 60 శాతానికి తగ్గింది.

కేంద్రం రూ.15,000 కోట్లు ఇస్తే మనం సంబరపడిపోయాం. ఈరోజు అందుకోలేనంత దూరం అప్పుల విషయంలో వెళ్లిపోయాం.

ప్రస్తుతం రాష్ట్రానికి వచ్చే ప్రతి రూ.100 ఆదాయానికి ఖర్చు రూ.113 ఉంది.

2024-25 రెవెన్యూ లోటు రూ.1.46,909 కోట్లకు చేరుతుంది.

పోలవరాన్ని పట్టించుకోకపోవడం వల్ల రూ.53,000 కోట్ల నష్టం వాటిల్లింది.

అమరావతిపై జగన్ విధ్వంసం వల్ల 7 లక్షల ఉద్యోగాలు పోయాయి. రూ.2 లక్షల నుంచి 3 లక్షల కోట్ల ఆస్తి ఆవిరైపోయింది.

రూ.32,000 కోట్ల మేర విద్యుత్ చార్జీలు పెంచారు.

పీపీఏ ఒప్పందాలు రద్దు చేయడం వల్లనే ప్రజలపై ఈ భారం పడింది.

పీపీఏ ఒప్పందాల రద్దుపై కోర్టుకు వెళ్తే వారికి రూ.9,000 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. ఆ తర్వాత యూనిట్ రూ.9కు విద్యుత్ కొన్నారు.

ఇసుకలో రూ.7,000 కోట్లు, గనుల్లో రూ.10,000 కోట్లు దోచుకున్నారు.

ఎక్సైజ్‌లో జగన్ విధానాల వల్ల రూ.17,000 కోట్ల నష్టం జరిగింది.

జగన్ సర్కారు రాగానే ప్రజావేదికను కూల్చేశారు.

పరిస్థితి బాగలేకున్నా...

ఆర్థిక పరిస్థితి సహకరించనప్పటికీ సూపర్ సిక్స్ అమలు చేసున్నాం. ఆగస్టు 15వ తేదీన 100 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నాం. మని చెప్పారు.

పీపీపీ, వీజీఎఫ్ విధానంలో రోడ్లు వేయాలన్న ఆలోచన ఉంది. టోల్ గేట్లు పెట్టి లారీలు, కార్లు, బస్సులకు మాత్రమే టోల్ వసూలు చేసి ఆ డబ్బు ను వీజీఎఫ్ కింద అందించాలన్న యోచనలో ఉన్నాం.

రాష్ట్రంలో తలసరి ఆదాయం పెరగలేదు. కానీ జగన్‌తో సహా వైసీపీ నేతల ఆదాయం లక్షల రెట్లు పెరిగింది. జగన్ హయాంలో జరిగిన అవినీతి విధానాలను అంతర్జాతీయ యూనివర్సిటీల్లో కేస్ స్టడీస్‌గా తీసుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలి.

# సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చారు

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు చెప్పిందే ఎల్లోమీడియాకు వేదం అని, చంద్రబాబు ఏం చెబితే అదే ఎల్లో మీడియా రాస్తుందని విమర్శించారు. రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని నమ్మిస్తారని, ఆ తర్వాత తమ అజెండా అమలు చేస్తారని వ్యాఖ్యానించారు. "ఇటీవలే మనందరికీ మొదటి స్టోరీ పరిచయం చేశారు. అదేంటంటే... రాష్ట్రం ఆర్థికంగా ధ్వంసం అయిపోయిన పరిస్థితిలో ఉంది అనేదే ఆ స్టోరీ. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనందువల్లే తాను రెగ్యులర్ బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోతున్నాడట. రాష్ట్రం నిజంగానే ఆర్థికంగా ధ్వంసం అయిపోయిందా అనే వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది. మీడియా కూడా బాధ్యతగా వ్యవహరించి, వాస్తవాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలి. రాష్ట్రం ఆర్థికంగా ధ్వంసం అయిపోయిందనే వాదనను చంద్రబాబు మీడియా సమావేశాల్లోనూ, గవర్నర్ ప్రసంగంలోనూ తీసుకొచ్చాడు. ఎన్నికల దగ్గర నుంచి చంద్రబాబు, ఆయన మీడియా ఊదరగొడుతున్నది ఏంటంటే... రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉందట. ఓవైపు రూ.14 లక్షల కోట్లు అప్పు ఉందని చెబుతూనే, మరోవైపు సూపర్-6 పథకాలు అన్నారు, సూపర్-7, సూపర్-10 అన్నారు. దేనికదే ప్రత్యేకంగా ప్రచారం చేసుకుంటూ వచ్చారు. చివరికి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాడు. ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజలందర అడుగుతున్నారు. దాంతో, ఎన్నికల్లో తాను చెప్పిన రూ.14 లక్షల కోట్ల అప్పు అంశాన్ని గట్టిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం వచ్చింది. అందుకే మళ్లీ గోబెల్స్ ప్రచారం మొదలుపెట్టాడు. కానీ వాస్తవం చెప్పాలంటే... అక్కడ రూ.14 లక్షల కోట్ల అప్పు నిజంగానే ఉందా? ఇప్పుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత లేనిది ఉన్నట్టు ఎలా చెప్పగలడు? బడ్జెట్ పత్రాల్లో ఇవన్నీ చూపించక తప్పదు కదా. కానీ, అవన్నీ చూపించలేని పరిస్థితి వచ్చేసరికి చంద్రబాబు పడరాని పాట్లు పడుతున్నాడు. ఇప్పటికే రెండుసార్లు రివ్యూ అన్నాడు, అధికారుల ట్రాన్స్ ఫర్ అన్నాడు... చివరికి గవర్నర్ ప్రసంగానికి వచ్చే సరికి రూ.14 లక్షల కోట్లను కాస్తా రూ.10 లక్షలకు తగ్గించాడు.

ఆ రూ.10 లక్షల కోట్ల విషయంలో అయినా గవర్నర్ తో నిజాలు చెప్పించాడా అంటే అదీ లేదు. ఓసారి నిజంగా రాష్ట్రంలో అప్పుల పరిస్థితి ఎలా ఉందో పరిశీలిద్దాం. నేను చెప్పేవన్నీ ఆర్బీఐ, కాగ్, స్టేట్ బడ్జెట్ డాక్యుమెంట్లలోని వివరాలు. చంద్రబాబు అనే వ్యక్తి గవర్నర్ తో కూడా అబద్ధాలు చెప్పించాడు, శ్వేతపత్రం పేరుతో మరీ అబద్ధాలు ఆడుతున్నాడు.

జూన్ నెల వరకు తీసుకుంటే ఏపీ ప్రభుత్వం నేరుగా చేసిన అప్పు రూ.5.18 లక్షల కోట్లు. 2014లో చంద్రబాబు అధికారంలోకి రాకముందు రూ.1,18,051 కోట్ల అప్పు ఉంటే... 2019లో చంద్రబాబు దిగిపోయే సమయానికి రూ.2,71,798 కోట్ల అప్పు ఉంది.

జూన్ లో మా పాలన ముగిసే సమయానికి ప్రభుత్వ అప్పు రూ.5.18 లక్షల కోట్లుగా ఉంది. వాటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీ రుణాలు రూ.1.06 లక్షల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ లేని రుణాలు రూ.1.23 లక్షల కోట్లు ఉన్నాయి. మొత్తమ్మీద పూర్తిస్థాయిలో రాష్ట్ర అప్పులు చూస్తే రూ.7.48 లక్షల కోట్లు" అని జగన్ వివరించారు.

గత 52 రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, ఆస్తులు ధ్వంసం చూస్తుంటే పురోగతి వైపు వెళ్తుందా?.. రివర్స్‌లో వెళ్తోందా అనే అనుమానం కలుగుతుంది అన్నారు. ప్రశ్నించే వాళ్లు లేకుండా ఉండేలా పాలన సాగుతోందని ఆరోపించారు. పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని అభిప్రాయపడ్డారు. హామీలపై ప్రజలు నిలదీస్తారని భావించే బడ్జెట్ కూడా పెట్టలేని అధ్వానమైన స్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉందన్నారు జగన్. పూర్థిస్థాయి బడ్జెట్ పెట్టే ధైర్యం చంద్రబాబుకు లేదని... మోసపూరిత హామీలకు కేటాయింపులను ప్రశ్నిస్తారని భయపడుతున్నారని అన్నారు. 14 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయిని ఇప్పటి వరకు ప్రచారం చేసిన చంద్రబాబు గవర్నర్ ప్రసంగంలో 10 లక్షల కోట్ల అప్పులు చూపించారని జగన్ వివరించారు. ఇప్పుడు శ్వేత పత్రాలతో మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఏడాది జూన్ వరకు ఏపీ తీసుకున్న అప్పులు రూ.5 లక్షల 18 వేల కోట్లు మాత్రమేనని వివరించారు. 2014 నుంచి ఐదేళ్ల వరకు చంద్రబాబు హయాంలో 21.63 శాతం వడ్డీతో అప్పులు చేశారని జగన్ వివరించారు. వైసీపీ హయాంలో కేవలం 12.63 శాతం మాత్రమే అప్పులు చేశామన్నారు. తమ హయాంలో జరిగిన ఆర్థిక విధానాలను కేంద్ర ఎకనామిక్ సర్వే ప్రశంసించిందన్నారు. 2 లక్షల 72 వేల కోట్ల అప్పుతో 2019లో చంద్రబాబు తమకు ప్రభుత్వాన్ని అప్పగించారని తెలిపారు జగన్. ఇప్పుడు అది ఐదు లక్షల 18 వేల కోట్లకు చేరిందని గుర్తు చేశారు.

## నేడే నీతి ఆయోగ్ భేటీ

-మొదటిపేజీ తరువాయి

చర్చించనున్నారు. ఈమేరకు.. 'వికసిత్ భారత్-2047' పేరుతో నీతి ఆయోగ్ ఇప్పటికే ఒక ఆధారపత్రాన్ని రూపొందించింది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కేంద్ర రాష్ట్రాల మధ్య సమన్వయం, ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థంగా చేర్చడం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రజల జీవన నాణ్యతను పెంచడం అవసరమని ఈ ఆధారపత్రంలో పేర్కొన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని మోదీ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు, ప్రత్యేక ఆహ్వానితులు, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్, సభ్యులు పాల్గొంటారు.

అయితే.. విపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల సీఎంలు ఈ భేటీకి రాబోమని ప్రకటించారు. కాగా, ఝార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వెళ్తారా? వెళ్లరా? అనే దానిపై అనిశ్చితి నెలకొంది. మరోవైపు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని విభజించాలంటూ ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ సుకాంత్ మజుందార్ ప్రధాని మోదీకి ప్రతిపాదన చేసిన నేపథ్యంలో ఆ రాష్ట్ర సీఎం మమత, టీఎంసీ కీలక నేత డెరెక్ ఒబ్రెయిన్ మాత్రం నీతి ఆయోగ్ భేటీకి హాజరు కానున్నారు. బెంగాల్ విభజనపై నీతిఆయోగ్ సమావేశంలో ప్రస్తావిస్తానని.. దాన్ని ప్రతిఘటిస్తానని మమత ప్రకటించారు. భేటీలో పాల్గొనేందుకు శుక్రవారం ఢిల్లీకి చేరుకున్న మమత.. మీడియాతో మాట్లాడారు. నీతి ఆయోగ్‌ను రద్దు చేసి, ప్రణాళికా సంఘాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

**'బెంగాల్ విభజన'పై రాజకీయ రగడ**

పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర భాగాన్ని ఈశాన్య రాష్ట్రాల్లో కలపాలంటూ బీజేపీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సుకాంత్ మజుందార్ ప్రధాని మోదీకి ప్రతిపాదన చేయడం రాజకీయంగా కలకలం రేపుతోంది. ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కేంద్ర సహాయ మంత్రి కూడా అయిన మజుందార్.. ఉత్తర బెంగాల్‌ను ఈశాన్య భారతంలో కలిపితే కేంద్రం నుంచి అధిక నిధులు వస్తాయని, అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికీ అభ్యంతరం ఉంటుందని తాను భావించడం లేదన్నారు. తన ప్రతిపాదనపై మోదీ దృష్టిసారిస్తారని భావిస్తున్నట్లు చెప్పారు. ఢిల్లీ నుంచి ఈ మేరకు ఆయన వీడియో ప్రకటన విడుదల చేశారు. అయితే, మంజుదార్ సూచనపై బెంగాల్ సీఎం మమత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్ విభజన అంటే దేశ విభజనే అని మండిపడ్డారు. కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు చేస్తున్న ఈ ప్రయత్నాలను శనివారం ప్రధాని ఆధ్వర్యంలో జరిగే నీతిఆయోగ్ సమావేశంలో నిలదీస్తానని తెలిపారు. ఒకవేళ పట్టించుకోకుంటే సమావేశం నుంచి వాకౌట్ చేస్తానని హెచ్చరించారు. "బడ్జెట్‌లో మా రాష్ట్రంపై ఆర్థిక వివక్ష చూపారు. ఇప్పుడు భౌగోళికంగానూ విభజన చేయాలని చూస్తున్నారు. పార్లమెంటు జరుగుతుండగానే కేంద్ర మంత్రి ప్రతిపాదన చేశారు. దీనిని సహించేది లేదు" అని మమత వ్యాఖ్యానించారు. కాగా.. ఉత్తర బెంగాల్‌లో బీజేపీకి పట్టు ఎక్కువ. ఇటీవలి ఎన్నికల్లో కూచ్‌బెహార్ తప్ప ఇక్కడి అన్ని ఎంపీ సీట్లనూ ఆ పార్టీనే గెలుచుకుంది. టీఎంసీకి మాత్రం దక్షిణ బెంగాల్‌లో గట్టి పట్టు ఉంది. అందుకే బీజేపీ 'ఉత్తర బెంగాల్' అంశాన్ని తెరపైకి తెస్తోందనే అభిప్రాయం వినిపిస్తోంది.

## ఏపీకి అదనపు ఐపీఎస్‌లు

-మొదటిపేజీ తరువాయి

ఢిల్లీ వెళ్లి హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసినా ఏనాడు ఐపీఎసల సంఖ్య పెంచే అంశంపై మాట్లాడిన దాఖలాలు లేవు. ఎప్పుడూ తన సొంత వ్యవహారాలు, కేసుల విషయం తప్ప పాలన వ్యవహారాలపై దృష్టిపెట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఢిల్లీ వెళ్లారు. హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిసి రాష్ట్రంలో ఐపీఎసల కొరత, ఇతర అంశాలపై ఆయనకు వివరించారు. పైగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన తర్వాత నాలుగైదు సంవత్సరాల అనుభవం ఉన్న జూనియర్ ఐపీఎసలను ఎస్పీలుగా నియమించాల్సి వస్తోంది. దీనివల్ల జిల్లాల్లో లా అండ్ ఆర్డర్ సమస్యలతో పాటు కొన్ని ఇబ్బందికరమైన పరిస్థితులు ప్రభుత్వం ఎదుర్కొంటోంది. ఈ విషయాలు మొత్తం అమిత్ షాకు చంద్రబాబు వివరించారు. సీఎం చంద్రబాబు విన్నపం మేరకు కేంద్ర హోం శాఖ ఏపీకి ఐపీఎసల సంఖ్య పెంచింది. 144 మంది ఐపీఎసలున్న కేడర్ స్ట్రెంత్‌ను 174కు పెంచింది. దాదాపు 30 మంది ఐపీఎసలను అదనంగా కేటాయించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ ద్వారా 121 మంది ఐపీఎసలు ఏపీల్లో విధులు నిర్వహించనున్నారు. 53 మందికి పదోన్నతుల ద్వారా ఐపీఎసలు కానున్నారు. ఇందులో 38 మంది వరకూ సెంట్రల్ డిప్యుటేషన్‌పై పని చేసే అవకాశం కల్పించారు. 23 మంది వరకూ స్టేట్ డిప్యుటేషన్‌పై వచ్చేందుకు కేంద్రం అనుమతిచ్చింది.

## వరద బాధిత కుటుంబాలకు రూ.3000 తక్షణ సాయం

-మొదటిపేజీ తరువాయి

నష్టాలపై సభలో చర్చించారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... 'ఇటీవల కురిసిన భారీవర్షాలకు తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు జిల్లాల్లో ఒక లక్షా 6 ఎకరాల్లో వరిపంట, 4,317 ఎకరాల్లో వరి నారుమళ్లు దెబ్బతిన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో 273 ఎకరాల్లో పంటలు ఇప్పటికీ వరద నీటిలోనే ఉన్నాయి. ఇలాంటి సమయంలో బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. పూర్తిస్థాయిలో వరద నష్టాలను అంచనా వేసిన తర్వాత పంటలు నష్టపోయిన రైతులకు నిబంధనల మేరకు ఇవ్వాల్సిన దానికంటే ఎక్కువే పరిహారం అందజేస్తాం' అని ప్రకటించారు. వరద నష్టాలను త్వరగా పూర్తి చేయించాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనితలను ఆదేశించారు. ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయికి వెళ్లి బాధితులను పరామర్శించాలని చెప్పారు.

**శాసనసభ నిరవధిక వాయిదా**

రాష్ట్ర శాసనసభ మొదటి సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు జరిగిన సమావేశాల గణాంకాలను స్పీకరు అయ్యన్న పాత్రుడు వెల్లడించారు. 'మొత్తంగా ఆరు రోజులు జరిగిన సమావేశాల్లో సభా కార్యకలాపాలు 27 గంటల 22 నిమిషాలపాటు కొనసాగాయి. రెండు బిల్లులను సభలో ప్రవేశపెట్టగా ఆ రెండూ ఆమోదం పొందాయి' అని స్పీకర్ వివరించారు. ఈ సమావేశాలు విజయవంతంగా ముగిశాయని పేర్కొన్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు... శుక్రవారం మధ్యాహ్నం 3.18 నిమిషాలకు సభను నిరవధికంగా వాయిదా వేశారు.

## విద్యా కానుక కొనసాగిస్తాం

-మొదటిపేజీ తరువాయి

జరిగాయని, టెండర్లు పిలవకుండానే విద్యా కానుక కిట్ల పేరిట కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారని అన్నారు. కిట్లు నాసిరకంగా ఉన్నాయని, వాటి కొనుగోళ్లపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యాకానుక కిట్ల పంపిణీని కొనసాగిస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వం గతేడాది విద్యాకానుక టెండర్లకు ఆర్థిక అనుమతులు లేకుండానే టెండర్లను ఫైనల్ చేసిందన్న విషయం శుక్రవారమే బయటకు వచ్చిందన్నారు. పిల్లలకు పుస్తకాలు ఎక్కువ బరువు ఉన్నాయని, ఈ అంశంపై ఏం చేయాలనేది ఆలోచన చేస్తున్నామని అన్నారు. విద్యార్థుల బ్యాగులు, పుస్తకాల బరువును తానే స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. బైజూస్ కంటెంట్ అంశంపై కూడా సమీక్షిస్తామన్నారు. ఈ పథకం కింద విద్యార్థులకిచ్చే బూట్ల సైజుల్లో తేడాలు ఉంటే అదే పాఠశాలలోగానీ, మండల స్థాయిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గానీ మార్చుకునే వెసులుబాటు కల్పిస్తామని, విద్యాకానుక కింద ఇచ్చే బ్యాగ్‌ల నాణ్యతపై కూడా ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు.

**తల్లికి వందనంపై దుష్ప్రచారం**

తల్లికి వందనం కార్యక్రమంపై స్పష్టత ఇచ్చినా కొందరు దుష్ప్రచారం చేయడం తగదని లోకేశ్ అన్నారు. ఈ కార్యక్రమం అమలు కోసం విధి విధానాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల్లో చెప్పినట్లుగానే సూపర్ సిక్స్ హామీలను తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. విద్యా కానుక కిట్లపై పార్టీల రంగులు ఉండకూడదన్నారు. ట్యాబ్‌ల పంపిణీపై ఫిర్యాదులు వచ్చిన దృష్ట్యా ఏం చేయాలనే దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చామని దానికి కట్టుబడి ఉన్నామని లోకేశ్ చె ప్పారు. గత వైసీపీ ప్రభుత్వం 2.3 లక్షల పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని, సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల్లో

# సమగ్ర ఆరోగ్య బీమాలో పెట్టుబడి పెట్టండి

- భారత్‌లో పెట్టుబడి ఎన్ఆర్ఐలకు ప్రయోజనం
- పాలసీబజార్ హెల్త్ ఇన్సూరెన్స్ హెడ్ సిద్ధార్థ్ సింఘాల్

హైదరాబాద్

విదేశాల్లో నివసించేవారు (ఎన్ఆర్ఐ) వారు భారతదేశంలో సమగ్ర ఆరోగ్య బీమాలో పెట్టుబడి పెట్టడం ఉత్తమమని పాలసీబజార్ హెల్త్ ఇన్సూరెన్స్ హెడ్ సిద్ధార్థ్ సింఘాల్ పేర్కొన్నారు. ఇది ఎన్ఆర్ఐలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. భారతదేశంలో శాశ్వతంగా స్థిరపడాలని ప్లాన్ చేస్తున్నప్పుడు తమకు కవరేజ్ మాత్రమే అవసరమని చాలామంది నమ్ముతారన్నారు. కానీ ఇది పూర్తిగా కచ్చితమైనది కాదన్నారు. అయితే, కుటుంబాన్ని చూసేందుకు వచ్చే సాధారణ సందర్శనల కారణంగా.. ఎన్ఆర్ఐలు వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల నుంచి ఆర్థికంగా రక్షించబడతారని తెలుసుకోవాలన్నారు. తగిన కవరేజీతో సమగ్ర ఆరోగ్య బీమాను కొనుగోలు చేయడం చాలా అవసరమన్నారు. యూఎస్ఏ, యూకే, సింగపూర్ తదితర దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ ఖర్చులు తక్కువగా ఉంటాయన్నారు. ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ) అనేది ఆరోగ్య సమస్యల సమయంలో, రోగనిర్ధారణ, సాధారణ తనిఖీలు, చిన్న శస్త్రచికిత్సలు, వివిధ చికిత్సల సమయంలో ఆసుపత్రి ఖర్చులలో ముఖ్యమైన భాగం అన్నారు. ఆసుపత్రిలో ఒక విభాగం ఓట్ పేషెంట్ డిపార్టమెంట్ అన్నారు. ఇక్కడ రోగులు ఆసుపత్రిలో చేరకుండానే వైద్యుడిని సంప్రదించడం, చికిత్స పొందడం జరుగుతుందన్నారు.

యూఎస్ఏలో డాక్టర్ ను సంప్రదించాలంటే రూ. 4,800 - రూ. 6,000, యూకేలో రూ.10,559 - రూ. 21,119, భారతదేశంలో రూ. 3000 - రూ.5000 మాత్రమే అవుతుందన్నారు. యూఎస్ఏలో ఎంఆర్ఐ రూ. 24,391- రూ. 73,174, యూకేలో రూ. 41,691, అయితే భారతదేశంలో రూ. 1500 నుంచి రూ. 25000 అవుతుందని తెలిపారు. అధిక ఆదాయ దేశాలలో నివసిస్తున్న ఎన్ఆర్ఐలు భారతదేశంలో ఉన్న వారి కంటే 50 నుంచి 60 శాతం ఎక్కువ ప్రీమియంలను ఎదుర్కోవచ్చని తెలిపారు. అందువల్ల, ఎన్ఆర్ఐలు ప్రణాళికాబద్ధమైన సర్జరీలు, సంప్రదింపులు సమయంలో తమ ఆర్థిక పరిస్థితిని కాపాడుకోవడానికి భారతదేశంలో సమగ్ర ఆరోగ్య బీమాలో పెట్టుబడి పెట్టడం మంచిదన్నారు. సమగ్ర ఆర్థిక రక్షణ కవరేజీని అందించే ఆరోగ్య బీమా పథకాలను ఎన్ఆర్ఐలు అన్వేషించాలన్నారు. ఈ ప్లాన్‌లు రూ. 5,000 నుంచి రూ.లక్ష వరకు ఔట్ పేషెంట్ డిపార్ట్మెంట్ కవరేజీని అందిస్తాయన్నారు. ఈ కవరేజీని ప్రామాణిక ఫీచర్‌గా చేర్చవచ్చున్నారు. ప్రామాణిక ఆరోగ్య బీమా పాలసీలో.. అప్పుడప్పుడు వైద్య సలహా కోసం జలుబు, జ్వరం వంటి చిన్న సమస్యలు, దద్దుర్లు వంటి తీవ్రమైన పరిస్థితులకు సాధారణంగా కవర్ చేయబడదన్నారు. అయితే, ఔట్ పేషెంట్ డిపార్ట్మెంట్ కవర్‌ని ఎంచుకోవడం అటువంటి ఖర్చులకు కవరేజీని చేర్చడం ద్వారా ఈ అంతరాన్ని పరిష్కరించవచ్చున్నారు. పిల్లలను కవర్ చేసే ఆరోగ్య బీమా ప్లాన్‌లలో ఈ ఫీచర్ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఎన్ఆర్ఐలు చాలా కాలం పాటు దేశానికి దూరంగా ఉన్నప్పుడు అలెర్జీలు, ఫ్లూ వంటి ఆరోగ్య సమస్యలకు తరచూ గురవుతారన్నారు. అందువల్ల, సమగ్రమైన ఆరోగ్య సంరక్షణ ఇచ్చే ఔట్ పేషెంట్ డిపార్ట్మెంట్ కవరేజీతో కూడిన ఆరోగ్య కవర్‌ను కొనుగోలు చేయడం కీలకమన్నారు. తక్షణం రోగి చికిత్సకు భరోసా ఇస్తారన్నారు. ఈ ప్లాన్‌లు గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, ఆప్తాల్మాలజీ, ఫిజియోథెరపీ, న్యూట్రిషనిస్ట్‌లతో సహా శారీరక నిపుణులతో సంప్రదింపులు కలవన్నారు. రక్త పరీక్షలు, మల పరీక్షలు, సీటీ స్కాన్‌లు, ఎక్స్-కిరణాలు, సోనోగ్రఫీ, ఎంఆర్ఐ స్కాన్‌లు వంటి పరీక్షల ఖర్చులను రీయింబర్స్ చేస్తుందన్నారు.

# జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించాలి

- నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ఛాంపియన్‌షిప్‌లు దోహదం చేస్తాయి.
- జిల్లా కలెక్టర్ డా. జి.సృజన
- ఘనంగా ప్రారంభమైన ఉమ్మడి కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు




విజయవాడ, మహానగర్

క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన సూచించారు. శుక్రవారం నగరంలోని పటమటలోగల చెన్నుపాటి రామకోటయ్య మునిసిపల్ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలను కలెక్టర్ డా. జి.సృజన ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ విద్య ఏ విధంగా అయితే మనం జీవితంలో అభివృద్ధి పథంలో పయనించేందుకు ఉపయోగపడుతుందో అదే విధంగా క్రీడలు వ్యక్తి సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తాయని.. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నైపుణ్యాలు మెరుగుపరచుకునేందుకు లోపాలను సవరించుకొనేందుకు ఇలాంటి ఛాంపియన్‌షిప్‌లు ఉపయోగపడతాయని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువులతో పాటు తమ పిల్లలను క్రీడల దిశగా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ సృజన పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ (కేడీబీఏ) ప్రెసిడెంట్, ఏపీబీఏ కార్యదర్శి, బీఏఐ జాయింట్ సెక్రటరీ డా. పి.అంకమ్మ చౌదరి మాట్లాడుతూ పారిస్ ఒలింపిక్ క్రీడల్లో భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు స్వర్ణంతో పాటు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఈ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26 నుంచి 28 వరకు పోటీలు జరుగుతాయని.. అండర్-11, అండర్-13, అండర్-15, అండర్-17, అండర్-19 విభాగాల్లో మహిళలు, పురుషుల కేటగిరీలో పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని సత్తా చాటేందుకు వీలుగా నైపుణ్యాలు మెరుగుపరచుకునేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేడీబీఏ కార్యదర్శి పరాశ శ్రీనివాస్, కేడీబీఏ వైస్ ప్రెసిడెంట్ ఎన్.మోహన్‌రావు, రిఫరీ టి.కృష్ణప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సింగిల్ డెస్క్ విధానంతో పరిశ్రమల ఏర్పాటుకు సత్వర అనుమతులు

- నిర్దిష్ట గడువులోగా దరఖాస్తులను పరిష్కరించండి
- ఎంఎస్ఎంఈలకు రూ. 1.14 కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాలు
- డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ డా. జి.సృజన



విజయవాడ, మహానగర్

సింగిల్ డెస్క్ విధానం కింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుంచి అందిన దరరఖాస్తులను పరిశీలించి.. త్వరితగతిన అనుమతుల జారీకి కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన సూచించారు. శుక్రవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సృజన అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, జిల్లా పరిశ్రమల అధికారి, మెంబర్ కన్వీనర్ ఎ.సుధాకర్, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో 2023, డిసెంబర్ 31 నుంచి 2024, జులై 25 మధ్యకాలంలో సింగిల్ డెస్క్ విధానం కింద అందిన దరఖాస్తుల పరిష్కారం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి ఆదేశాలిచ్చారు. వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 225 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 205 దరఖాస్తులు ఆమోదం పొందాయని, 17 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, మిగిలిన వాటిని తిరస్కరించినట్లు తెలిపారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులను నిర్ధిష్ట గడువులోగా పరిష్కరించాలని ఏపీఐఐసీ, ఏపీపీసీబీ, ఫ్యాక్టరీలు, అగ్నిమాపక సేవల శాఖల అధికారులను ఆదేశించారు. ఐడీపీ (2015-20), ఐడీపీ (2020-23), బడుగు వికాసం కింద సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలావడ్డీ, విద్యుత్ టారిఫ్ తదితర రాయితీల కింద మొత్తం 30 యూనిట్లకు దాదాపు రూ. 1.14 కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలియజేసింది. 2024, జులై 6న జరిగిన స్క్రుటినీ వెరిఫికేషన్ కమిటీ (ఎస్‌వీసీ) సమావేశ నిర్ణయాలను తాజాగా కమిటీ ముందు పెట్టగా.. కమిటీ వివిధ రాయితీలకు ఆమోదం తెలిపింది. ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధి పరంగా కీలకమైన ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు, ఉన్న సంస్థల సుస్థిర అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతోందని.. డీఐఈపీసీ సమావేశాలను ప్రతి నెలా నాలుగో శుక్రవారం క్రమంతప్పకుండా నిర్వహించనున్నట్లు కలెక్టర్ సృజన తెలిపారు. ఈ సమావేశంలో ఫ్యాప్సియా ప్రెసిడెంట్ వి.మురళీకృష్ణ, మహిళా పారిశ్రామికవేత్తల అసోసియేషన్ ప్రతినిధి కనకదుర్గ, ఏపీఐఐసీ జెడ్ఎం కె.సీతారాం, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీటీసీ ఎం.పురేంద్ర, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు స్టేడియంను సిద్ధం చేయండి



విజయవాడ, మహానగర్

78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన తెలిపారు. ఆగస్టు 15వ తేదీన స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 78వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి చేయవలసిన ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ జి. సృజన, ఏపిఎస్‌పి డిఐజి బి. రాజకుమారి, నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమీషనర్ హెచ్ యం ధ్యాన చంద్రలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీన రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఇంధిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ తో పాటు రాష్ట్ర మంత్రులు ఉన్నతాధికారులు వేడుకలలో పాల్గొంటారన్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, నగరపాలక సంస్థ, రెవెన్యూ, ఆర్అండ్ బి, ట్రాన్స్‌కో, ఫైర్, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ప్రారంభించాలన్నారు. ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి స్టేడియంలో చేస్తున్న ఏర్పాట్లను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో నిర్వహించిన వేడుకలలో ఎదురైన లోటుపాట్లను గుర్తించి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏర్పాట్లపై జిల్లా అధికారులకు అప్పగించిన భాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సృజన తెలిపారు. పరిశీలనలో ఆర్‌డివో బిహెచ్ భవాని శంకర్, డిసిపిలు గౌతమి శాలి, ఏబిటిఎస్ ఉదయరాణి, కె. చక్రవర్తి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పురుష వంధ్యత్వంపై దేశంలో పెరుగుతున్న ఆందోళనలు

విజయవాడ

మన దేశంలో సంధ్యత్వం ప్రాబల్యం దాదాపు 15 నుండి 20 శాతం ఉందని, పురుషుల వంధ్యత్వం దీనికి 40 శాతం దాకా దోహదపడుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ డేటా సూచించడం కలకలం రేపుతోంది.ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెడ్ రీప్రొడక్షన్ (ఐఎస్ఎఆర్) ప్రకారం, భారతదేశంలో దాదాపు 10-14 శాతం దంపతులు వంధ్యత్వం కలిగి ఉన్నారు. ముఖ్యంగా, వంధ్యత్వం అనేది మహిళల్లో మాత్రమే కాదు.. పురుషులలో కూడా పెరుగుతోంది. కానీ వంధ్యత్వం అనగా అందరి దృష్టి భారం ఎల్లప్పుడూ మహిళలపైనే ఉంటోంది. చాలా సందర్భాలలో వంధ్యత్వం అనేది ఒక జంట తల్లిదండ్రులయ్యే ఆనందాన్ని దూరం చేసేదిగా ఉండనప్పటికీ, సంతానోత్పత్తి సమస్యలతో బాధపడుతున్న చాలా మంది పురుషులు సరైన వైద్య సంరక్షణ, మార్గ దర్శకత్వం లేకుండా నిశ్శబ్దంగా ఉంటున్నారు. వంధ్యత్వం అనేక కారణాల వల్ల కలుగుతుంది స్త్రీ, పురుష పునరుత్పత్తి వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది. పునరుత్పత్తి నాళాల యొక్క అడ్డంకుల వల్ల వీర్య స్థలనంలో సమస్యలు (స్కలన నాళాలు, సెమినల్ వెసికిల్స్ వంటివి), పిట్యూటరీ గ్రంథి, హైపోథాలమస్, వృషణాల ద్వారా ఉత్పత్తి చేయబడిన హార్మోన్లలో హార్మోన్ల సమతుల్యత లేదా స్పెర్గ్.. ప్రొడక్షన్ కణాలను బలహీనపరిచే పరిస్థితుల కారణంగా వృషణాలు వీర్యకణాలను ఉత్పత్తి చేయడంలో విఫలమైనప్పుడు, వీర్యకణాల అసాధారణ ఆకారం లేదా నాణ్యత కారణంగా దాని పదనిర్మాణం (మార్ఫాలజీ), కదలికను ప్రభావితం కావడం వల్ల అవి స్త్రీ అండాన్ని ఫలదీకరణం చేయడం కష్టమవుతుంది. చాలా మంది పురుషులు, మహిళలు ఇప్పుడు తమ ముప్పైల మధ్య నుండి చివరిలోపు వివాహం చేసుకుంటున్నారు. ఇది వారు తల్లిదండ్రుల కావడంలో ఆలస్యానికి దారితీస్తుంది. పురుషుల వయస్సులు పెరుగుతున్న కొద్దీ వారి వీర్యకణాల నాణ్యత కూడా తగ్గుతుంది. ఇది ఆ జంట సహజంగా గర్భం దాల్చడన్ని కష్టతరం చేస్తుంది. దీనితో పాటు పురుషులు రోజూ ఎదుర్కొనే అనేక సాధారణ సమస్యలు కూడా వంధ్యత్వానికి దోహదం చేస్తాయి. ఒత్తిడి, ఊబకాయం, వృషణాలకు తీవ్రమైన గాయం లేదా వృషణాలు చాలా కాలం పాటు వేడెక్కిడం వంటి సమస్యలు వీటిలో ఉన్నాయి. మద్యం లేదా పొగాకు వంటి వ్యసన పదార్థాల హానికరమైన వినియోగం ద్వారా కూడా వంధ్యత్వ సమస్యలు తీవ్రమవుతాయి.ఈ సందర్భంగా విజయవాడ ఫెర్టి కేర్ ఐవిఎఫ్ సెంటర్ ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ డాక్టర్ ప్రత్యూష జువ్వాడి మాట్లాడుతూ, 'నిశ్చల జీవనశైలి, ఒత్తిడి కారణంగా పట్టణ కేంద్రాలలో పురుషుల వంధ్యత్వం పెరుగుతోంది. శారీరక శ్రమ లేకపోవడం టెస్టోస్టెరాన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. ఇది తక్కువ స్థాయి స్పెర్మ్ నాణ్యతను కలిగిస్తుంది. కార్యాలయంలో ఒత్తిడి ఆందోళన కలిగిస్తుంది. ఇది హార్మోన్ల అసమతుల్యతతో కలిసి నిరాశ, సత్తువ తగ్గడానికి దారితీస్తుంది. మనం రోజులో ఎక్కువ భాగం డెస్క్ ల వద్దనే కూర్చుంటున్నాం. వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం అనేది ఆధునిక జీవనశైలి ఫలితంగా ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలకు నివారణ జీవనశైలిలో సమతుల్య ఫిట్నెస్ అంశాన్ని చేర్చడం శారీరక శ్రేయస్సును మెరుగుపరచడమే కాకుండా తల్లిదండ్రులం కావాలనుకునే దిశగా సాగించే ప్రయాణానికి మద్దతు ఇస్తుంది' అని అన్నారు.

## ఓబీటీ పరీక్షల్లో స్కూల్ ఫస్ట్ సాధించిన షేక్ సుహానా

విజయవాడ




నగరంలోని బీఆర్టీఎస్ రోడ్డులో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ ఆరో తరగతి విద్యార్థిని షేక్ సుహానా ఓబీటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరించింది. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో సుహానా స్కూల్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. పరీక్షల్లో ప్రతిభ చూపిన సుహానాను స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజారాణి ప్రత్యేకంగా అభినందించారు. స్కూల్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సుహానాకు ప్రశంసాపత్రం, మెడల్ అందజేశారు.

# మహానగర్

## క్రీడా కురుక్షేత్రమే

# ఒలింపిక్స్

జీవితంలో ముఖ్యమైన విషయం జయించడమే కాదు, బాగా పోరాడడం కూడా. ఇదే క్రీడలకు కూడా వర్తిస్తుంది. ఏ క్రీడ అయినా గెలుపొందడం కంటే పాల్గొనడం చాలా ముఖ్యమని ఆయన ప్రధాన సందేశం. ఒకవేళ ఓటమి చవి చూసినా క్రీడా స్ఫూర్తితో ఆ క్రీడను ఆస్వాదిస్తారు. ఆధునిక ఒలింపిక్స్ పితామహుడు పియరీ డి కూబెర్టిన్ ప్రధాన ఆశయం కూడా ఇదే. మొదటి స్థానంలో నిలబడటం అనే ఆత్రుత పక్కన పెట్టి పాల్గొనడం, బాగా ఆడటం క్రీడల ఆశావాద దక్పోణంగా క్రీడాకారులందరూ గుర్తించాలనేది ఒలింపిక్ క్రీడల ప్రధాన సందేశం. ప్రపంచాన్ని మార్చే శక్తి, స్ఫూర్తినిచ్చే శక్తి క్రీడలకు ఉంది. అంతే కాదు మరెవ్వరూ చేయని విధంగా ప్రజలను ఏకం చేసే శక్తి క్రీడలకు ఉంది. దీనిని నిరూపిస్తూ నిర్వహిస్తున్న క్రీడలే ఒలింపిక్ క్రీడలు. ఎన్నో క్రీడలు.. మరెన్నో దేశాలు.. ప్రపంచవ్యాప్తంగా అథ్లెట్లందరూ కలిసి పోటీపడే విశ్వ వేదిక ఒలింపిక్స్. ఆటలాడే ప్రతి దేశానికి ఆశల సౌధం అది! క్రీడాకారుల ప్రతి ఒక్కరి అంతిమ లక్ష్యం అది! పతకం నెగ్గి తమ దేశ జెండా ఎగురుతుంటే పోడియం మీద గర్వంతో రొమ్ము విరుచుకు నిలబడాలని కోరుకునే.. క్రీడా కురుక్షేత్రమే ఒలింపిక్స్ ఐదు ఖండాలను ఒక్కతాటిపైకి తెస్తూ..



నాలుగేళ్లకోసారి జరిగే ఈ ఆటల పండుగది దశాబ్దాల ఘన వారసత్వం.14 దేశాలు, 241 అథ్లెట్లతో మొదలైన ఆధునిక ఒలింపిక్స్ ఇప్పుడు 200 పైచిలుకు దేశాల నుంచి 11 వేల క్రీడాకారులతో ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడా వేడుకగా మారింది. అందుకే ఒలింపిక్స్ విశ్వ వ్యాప్తంగా ఆదరణ పొందింది ఈ విశ్వ క్రీడల కోసం క్రీడా ప్రపంచం ఊపిరి బిగబట్టి చూస్తుంది. ఇందులో తమ క్రీడాకారులు ఆడాలని పతకాలు గెలవాలని, వేదికపై తమ దేశ జెండా ఎగరాలని ప్రతి దేశం కోరుకుంటుంది. మరెన్నో దేశాలు ఒట్టి చేతులతోనే తిరిగొస్తున్నాయి. అయినా పోటీ పడడమే గొప్ప అనుకుంటాయి. అంత గొప్పది ఒలింపిక్స్ విశ్వ క్రీడలకు 3000 ఏండ్ల చరిత్ర ఉంది. క్రీస్తుపూర్వం 776 లోనే ఒలింపిక్స్ ప్రారంభమైనాయి . క్రీస్తు శకం 393 తర్వాత ఆగిపోయాయి. వాటిని ప్రాచీన ఒలింపిక్ క్రీడలు గా పిలిచారు. మళ్లీ 1896లో మొదలై, నాలుగేళ్లకోసారి జరుగుతున్నాయి. వీటిని ఆధునిక ఒలింపిక్స్ అంటున్నారు. ఇవి ప్రపంచ యుద్ధాల సమయంలో (1914, 1940, 1944) ఆగిపోగా.. కరోనా కారణంగా ఒక ఏడాది ఆలస్యంగా మొదలయ్యాయి. ఒలింపిక్స్ పుట్టుక వెనుక ఆసక్తికరమైన కథ ఉంది. క్రీస్తు పూర్వం ఎనిమిదో శతాబ్దంలో గ్రీకు సామ్రాజ్యంలోని రాజ్యాల మధ్య తరచూ యుద్ధాలు జరిగేవి. దానివల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడేవాళ్లు. గ్రీకు సామ్రాజ్యంలో ఎప్పుడు అశాంతి ఉండేది. దాంతో, ఈ యుద్ధాలు ఆపి, రాజ్యాల మధ్య శాంతి నెలకొల్పాలని గ్రీకులు అనుకున్నారు. అందుకు రాజ్యాల మధ్య ఆటలు ఆడించడమే మంచిదని నిర్ణయించారు. అలా క్రీస్తు పూర్వం 776లో తొలిసారి దక్షిణ గ్రీసులో ఒలింపియా అనే ప్రాంతంలో ఆటల పోటీలను నిర్వహించారు. క్రమంగా దానికి ఒలింపిక్స్ అనే పేరొచ్చింది. ప్రతి నాలుగేండ్లకోసారి నిర్వహించే ఈ ఈ క్రీడా పోటీలు జరిగేటప్పుడు యుద్ధాలు ఆపేవారు. ప్రజలు తమ పనులన్నీ పక్కన పెట్టి మరీ.. క్రీడలు జరిగే పట్టణానికి వచ్చేవాళ్లు. కానీ, రోమ్ చక్రవర్తి థియోడోసియస్ గ్రీస్ సామ్రాజ్యాన్ని జయించాక అన్ని ఉత్సవాలను నిలిపివేశాడు . దాంతో, క్రీస్తు శకం 393 లో ఒలింపిక్స్ కూడా ఆగిపోయినయ్. అయితే, ఫ్రాన్స్కు చెందిన చరిత్రకారుడు చార్లెస్ పియెర్ డి ఫ్రెడీ, బెరోన్ డి కోబర్టిన్ ఒలింపిక్స్ మళ్లీ మొదలు పెట్టేందుకు కృషి చేశారు. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)ని 1896లో స్థాపించారు. వీళ్ల కృషి వల్ల., ప్రాచీన క్రీడలు ఆగిన ప్రదేశం ఏథెన్స్ లోనే 1896లో ఆధునిక ఒలింపిక్స్ ప్రారంభమైనాయి ఈ క్రీడోత్సవంలో 14 దేశాలకు చెందిన 241 అథ్లెట్లు పోటీ పడ్డారు. వాళ్లంతా పురుషులే. పురాతన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఇప్పుడు కూడా నాలుగేళ్లకోసారి గేమ్స్ నిర్వహిస్తున్నారు. ఆధునిక ఒలింపిక్స్ అధికారిక క్రీడలుగా గుర్తించగా... ఇప్పటిదాకా 28 సార్లు జరిగాయి. ప్రపంచ యుద్ధాల కారణంగా మూడు సార్లు రద్దయ్యాయి. పది, పదిహేను దేశాలు పోటీపడే క్రికెట్ వరల్డ్ కప్ టోర్నీనే హంగామాగా ఉంటుంది. అలాంటిది పదుల సంఖ్యలో జరిగే క్రీడలు ఒక్కచోట జరిగితే.. వందల దేశాలు, వేలాది మంది ఆటగాళ్లు ఒకే వేదికపై పోటీపడితే మామూలుగా ఉంటదా! పైగా, ఆ క్రీడోత్సవం నాలుగేళ్లకోసారి జరిగితే.. దానికోసం ఆతిథ్యమిచ్చే దేశం వేలాది కోట్లు ఖర్చు పెడితే.. పోటీల కోసం యావత్ ప్రపంచం ఎదురు చూస్తుంటే చూడ్డానికి రెండు కళ్లు చాలవు! ఒలింపిక్స్ ఉండే ఆదరణ అది. ఎప్పట్లాగే, ఈసారి కూడా పారిస్ ఒలింపిక్స్ కోసం అంత ఆతృత. ఎవరెలా ఆడతారు ఏ దేశం హవా నడుస్తోంది ఎన్ని రికార్డులు బద్దలవుతాయనే లెక్కలేసుకున్నారు. విశ్వ క్రీడా సంబరం ఒలింపిక్స్ ఈ నెల 26 నుంచే. పారిస్ వేదికగా అంగరంగ వైభవంగా క్రీడలను నిర్వహించడానికి సన్నాహాలు పూర్తయ్యాయి. ఎప్పట్లాగే ఎన్నో ఆశలతో భారత బృందం కూడా ఒలింపిక్స్‌కు సిద్ధమైంది. గత పర్యాయం తో పోలిస్తే ఈసారి ఒలింపిక్స్లో పోటీపడే అథ్లెట్ల సంఖ్య తగ్గింది. సంఖ్య తగ్గినా ఒలింపిక్స్ లో 124 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.. కాబట్టి ఈసారి టోక్యోకు దీటుగా పతకాలు సాధించగలమనే ధీమా భారత బృందంలో ఉంది. 2021లో జావెలిన్ త్రో లో స్వర్ణం సాధించి భారత అథ్లెటిక్స్ సువర్ణాధ్యాయాన్ని లిఖించిన నీరజ్ చోప్రా మరోసారి భారీ అంచనాలతో బరిలోకి దిగుతున్నాడు. గత క్రీడల్లో కాంస్యం సాధించిన హాకీ జట్టు ఈసారి పతకం రంగు మార్చాలనే పట్టుదలతో ఉంది. 2016, 2021లో నిరాశపరిచిన షూటర్లు ఈసారి పతకాలు కొల్లగొట్టాలనే కసితో ఉన్నారు. ఇంకా బ్యాడ్మింటన్, బాక్సింగ్, రెజ్లింగ్లోనూ పతకాశలు రేపుతున్న క్రీడాకారులు చాలామందే ఉన్నారు. మరి ఈ బృందం అంచనాలను అందుకుంటుందా పతకాల సంఖ్యను రెండంకెలకు తీసుకెళ్తుందా 'ఐక్యత మరియు స్థితిస్థాపకత'. ఆనే నినాదం తో పారిస్ వేదికగా జులై 26 నుండి జరగబోయే ఒలింపిక్స్‌లో క్రీడాభిమానులు, నిపుణుల అంచనాలకు అనుగుణంగా మన క్రీడాకారులు భారత్ పతాకాన్ని పారిస్ వినువీధుల్లో గర్వంగా ఎగురవేస్తారని, పతకాల పంట పండిస్తారని ఆశిద్దాం.

# అనితర సాధ్యాలు సంగం లక్ష్మీబాయి సేవలు


తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళలను ముందుండి నడిపించిన ధీర వనిత ఆమె. బాలికల, స్త్రీల సంక్షేమం కోసం నిరంతరం తపించి, జీవితాంతం చిత్తశుద్ధితో పాటుపడిన సేవా నిరతికి ప్రతిరూపం ఆమె. స్వాతంత్ర్య సమర యోధురాలుగా తామ్రపత్ర గ్రహీత ఆమె. శాసన సభ్యురాలిగా, విద్యా మంత్రిణిగా, ఆంధ్రప్రదేశ్ సామాజిక, సంక్షేమ సలహా బోర్డు కోశాధికారిణిగా, హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగం కన్వీనర్‌గా, ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా, అంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ బాధ్య రాలిగా సమర్ధ వంతంగా పనిచేసి, ప్రశంసలు అందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆమె. ఆమే ఆంధ్రప్రదేశ్ నుండి లోక్‌సభ సభ్యురాలైన తొలి మహిళగా గుర్తింపు పొందిన సంగం లక్ష్మీబాయి. సంగం లక్ష్మీబాయి(జూలై 27, 1911 – జూన్ 3, 1979) 1911, జూలై 27 న ఘటకేసర్ సమీపం లోని ఒక కుగ్రామంలో జన్మించారు. బాల్యం లోనే తల్లిదండ్రులు, చిన్నతనం లోనే వివాహమై భర్త చని పోవడంతో ఆమె అనాథ అయ్యారు. చాలా చురుకైన బాలిక కావడంతో మద్రాసు ఆంధ్ర మహిళా సభలో చదువుకునే అవకాశం లభ్యమైంది. కార్వే విశ్వ విద్యాలయం, ఉన్నవ లక్ష్మీ బాయమ్మ ప్రారంభించిన శారదా నికేతన్, మద్రాసు ఆర్ట్స్ కళాశాలలో చదువు కున్నారు. అక్కడ ఉన్నత చదువుల అనంతరం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. నారాయణ గూడలో ఉన్న రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి ఉమెన్స్ కాలేజ్ హాస్టల్ బాధ్యతలు చూసు కుంటూనే మరోవైపు స్వాతంత్ర్యో ద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఎంతోమంది మహిళలను ఉద్యమాల్లో భాగస్వాములను చేశారు.ఆమె సాంఘిక సేవలోనే పూర్తి సమయం వెచ్చించి ఆ తర్వాత రాజకీయాలలో చేరారు. ఆమె విద్యార్థిగా ఉన్న రోజులలో సైమన్ కమీషన్ ను వ్యతిరేకించారు. ఉప్పు సత్యాగ్రహం (1930–31) లో క్రియాశీలంగా పాల్గొని ఒక సంవత్సరం జైలు శిక్ష అనుభవించారు. స్వామి రామానందతీర్థ



ఆధ్వర్యంలో సాగిన నిజాం వ్యతిరేక ఉద్యమంలో ముఖ్య పాత్ర వహించారు. 1932లో శాసనోల్లంఘనలో పాల్గొని అరెస్ట్ అయి రాయవెల్లూరు జైలులో శిక్ష అనుభవించారు. ఆమె వినోభా భావే యొక్క తొలి పాద యాత్రకు తెలంగాణలో సారథ్యం వహించారు. 1950లో భూదానో ద్యమ యాత్ర కోసం తెలంగాణకు వచ్చిన ఆచార్య వినోబా బావే ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించారు. ఆయన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు 16 గ్రామాలు తిరిగి 314 ఎకరాల భూమిని సేకరించారు. 1947–48లో తెలంగాణ విమోచనో ద్యమం లోనూ పాల్గొన్నారు. విమోచన అనంతరం సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆమె 1952 లో నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. బూర్గుల రామకృష్ణారావు కేబినెట్‌లో విద్యాశాఖ సహాయ మంత్రిగా 1954 నుంచి 1956 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె హయాంలోనే తెలంగాణ జిల్లాల్లో బాలికల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు ప్రారంభమయ్యాయి. మంత్రిగా సంపాదన మొత్తాన్ని స్త్రీ సేవాసదన్‌కు ఉపయోగించారు. 1955లో దాన్ని తన సహచరులైన కేవీ రంగారెడ్డి, ఎ.శ్యామలాదేవి, పి.లలితాదేవి, పాశం పాపయ్య, ఎం.భోజ్‌రెడ్డితో కలిసి ఇందిరా సేవా సదన్‌గా రిజిస్టర్ చేయించారు. తద్వారా అనాథ మహిళలు, శిశువులకు ఉచిత విద్యనందించారు. సంతోష్ నగర్ చౌరస్తాలో ప్రస్తుతం ఐ.ఎస్.సదన్ గా పిలవబడుతున్న ప్రాంతంలో ఆమెకు రెండెకరాల స్థలంలో ఇల్లుండేది. తమ సొంత ఇంటిలోనే అనాథ శరణాలయాన్ని ప్రారంభించారు. అదే కాకుండా రాధికా మెటర్నిటీ హోమ్, వసు శిశువిహార్, మాశెట్టి హనుమంతు గుప్తా బాలికల ఉన్నత పాఠశాలల యొక్క స్థాపనలో ఆమె పాత్రలు మరిచి పోలేనివి.లక్ష్మీబాయి సేవల గురించి తెలుసుకున్న నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా వచ్చి సాయం చేశారు. నాటి డిప్యూటీ సీఎం కొండా వెంకట రంగారెడ్డితో పాటు ఇందిరా గాంధీ కూడా సేవా సదనం నిర్వహణకు తోడ్పాటు అందించారు.1957లో మెదక్ నియోజక వర్గం నుండి 2వ లోకసభకు ఎన్నిక య్యారు. 1962 లో 3వ లోకసభకు ఎన్నికయ్యారు. మూడవ సారి 1967లో 4వ లోకసభకు వరుసగా మెదక్ లోకసభ నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. హైదరాబాదు యాదవ మహాజన సమాజం అధ్యక్షురాలిగా, అఖిల భారత విద్యార్థి సంఘం ఉపాధ్యక్షు రాలిగా, హైదరాబాదు ఫుడ్ కౌన్సిల్, ఆంధ్ర యువతి మండలి అధ్యక్షురాలిగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ సామాజిక సంక్షేమ సలహా బోర్డుకు కోశాధికారిణిగా, హైదరాబాదు ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా విభాగ కన్వీనరుగా ఉన్నారు. ఆమె పద్దెనిమిదేళ్ల పాటు ఆంధ్ర మహిళా సభ సభ్యురాలిగా ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, అఖిల భారత కాంగ్రెసు కమిటీ బాధ్యురాలిగా కొన్నాళ్లు పని చేశారు. స్వాతంత్ర్య సమర యోధురాలిగా గుర్తించిన భారత ప్రభుత్వం ఆమెకు తామ్రపత్రం ఇచ్చి గౌరవించింది. 1979లో మరణించే వరకు లక్ష్మీబాయి స్త్రీలు, బాలికల సంక్షేమం కొరకు నిర్విరామ, అసమాన కృషి చేశారు.

# భారత ఖ్యాతిని చాటిన కలామ్

అబ్దుల్ కలామ్.. ఈ పేరు తెలియని భారతీయుడు ఉండడంటే ఆశ్చర్యం లేదు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆయన. ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి.. నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆయన జీవిత ప్రస్థానం నిజంగా అద్భుతం. దేశం కోసం పెళ్లి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయిన ఆయన జీవితం ఆదర్శం. అనితర సాధ్యమైన విజయాలను తన ఖాతాలో వేసుకోవడం గొప్పతనం. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన కలాం. హార్ట్ స్టంట్ రూపొందించడం లోనూ పాత్ర పోషించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఆయన జయంతి ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటారు. అబ్దుల్ కలాం తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం లో ఒక ముస్లిం కుటుంబంలో 1931 అక్టోబర్ 15న జన్మించాడు. తండ్రి పేరు జైనలబుద్దిన్ మరాకాయర్, తల్లి పేరు అషియమ్మా జైనబుల్బుద్దిన్. అబ్దుల్ కలాం పూర్తి పేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబానికి సహాయం చేయడానికి చిన్న వయసు లోనే న్యూస్ పేపర్లు వేసేవాడు. రామేశ్వరానికి కొద్ది దూరంలో ఉన్న రామనాథపురంలో స్కెచ్ మెట్రిక్యులేషన్ స్కూల్లో పదో తరగతి వరకు చదువు కున్నాడు. చదువు అంత అంత మాత్రమే అయినప్పటికీ నేర్చుకోవాలనే తపన ఎక్కువగా ఉండేది. స్కూల్లోనే ఉపాధ్యాయుడు ఒకసారి సముద్రపు ఒడ్డుకు తీసుకువెళ్లి పక్షి ఎలా ఎగురుతుందో చూపించాడు. అప్పటి నుండి కలాం కూడా పక్షిలా ఎగరాలను కున్నాడట. ఎలాగైనా పైలెట్ కావాలని అనుకున్నాడు. తరువాత తిరుచ్చిలో సెయింట్ జోసెఫ్ కళాశాలలో డిగ్రీ పట్టా పొందాడు. కలాం తన చిన్ననాటి కోరిక నిజం చేసు కోవడానికి మద్రాసులోని ఎన్ఐటీల్లో చేరాడు. ఐతే ఇన్స్టిట్యూట్ లో చేరాలంటే వెయ్యి రూపాయలు ఫీజు కట్టాల్సి వచ్చింది. కానీ ఆయన తండ్రి దగ్గర లేనపుడు కలాం అక్క తన రెండు గాజులు అమ్మి ఫీజ్ కట్టింది. ఎలాగైనా బాగా చదివించాలని ఉన్నతమైన స్థానంలో చూడాలని తన కుటుంబ సభ్యులు పడుతున్న కష్టాన్ని తన మీద వాళ్లకు నమ్మకాన్ని చూసి చలించి పోయాడు. చివరకు స్కాలర్షిప్ సహాయంతో ఎం ఐ టి లో ఎరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేయగా, అందులో నాటికల్ ప్రవేశ పరీక్షల్లో 8 ఉద్యోగాలు ఉంటే తనకు 9వ స్థానం రావడంతో తృటిలో పైలెట్ అయ్యే అవకాశాన్ని కోల్పోయాడు. కలాం తన చిన్ననాటి కల చేజారి పోయింది. 1960 కలాం డీఆర్డీఓ (%ణ=ణూ%)లో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ లో శాస్త్రవేత్తగా చేరారు. అక్కడ భారత సైన్యం కోసం ఒక ఓవర్ క్రాఫ్ట్ డెవలప్ చేయడం ఆయన పని. కొన్ని రోజులకి ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ నుండి కలాం కి ఇంటర్వ్యూకు రమ్మని పిలుపు వచ్చింది. ఇప్పుడు దీనినే ఇస్రోగా (%×ూ=వా%) పిలుస్తున్నారు. ప్రొఫెసర్ విక్రం సారాభాయ్ ఇంటర్వ్యూ చేశారు. అలా కలాం రాకెట్ ఇంజినీరుగా సెలక్ట్ అయ్యారు. విక్రం సారాభాయ్, కలాం కలిసి ఇస్రో ను ఎంతగానో అభివృద్ధి చేశారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరి, ఇతర



శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయ వంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారత దేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. క్రమంలో ఆరు నెలలపాటు రాకెట్ లాంచింగ్ టెక్నిక్ మీద ట్రైనింగ్ కోసం అమెరికాలోని "నాసా" వెళ్లే అవకాశం దక్కింది. భారత్ నుండి అంతరిక్షంలోకి శాటిలైట్ పంపాలనేది ప్రొఫెసర్ సారాభాయ్ కోరిక. శిక్షణ పూర్తి అయిన తర్వాత కలాం... సారాభాయ్ మరియు సతీష్ సహకారంతో "రోహిణి" అనే శాటిలైట్ ని అంతరిక్షంలోకి పంపడానికి ఎస్ఎల్వి–3 అనే రాకెట్ ని అభివృద్ధి చేశారు. దేశంలోని ప్రజలందరికీ ఎస్ఎల్వి–3 మీదే కళ్ళు ఉన్నాయి. కలాంతో పాటుగా అక్కడ ఉన్న ఎంతోమంది కష్టపడి నిర్మించిన 22 మీటర్ల పొడవైన ఎస్ఎల్వి–3 లాంచ్ అయింది. 315 సెకండ్ తర్వాత సెకండ్ స్టేజ్ పేలిపోయి సముద్రంలో కుప్పకూలి పోయింది. కలాంకు ఏదో తెలియని ఆవేదన. దేశ ప్రజల అందరి కళ్లు ఆవిరై పోయాయి. మళ్ళీ తిరిగి 1980 2 వ ఎస్ఎల్వి–3 రెడీ చేశారు. మొదటి దాని లాగానే ఇది కూడా ఫెయిల్ అవుతుందని వ్యాఖ్యానించారు. 18 జూలై 1980 లో ఎస్ఎల్వి–3 రోహిణి విజయ వంతంగా ప్రవేశ పెట్టింది..అంతరిక్షం లోకి శాటిలైట్ ని పంపగలిగే కెపాసిటీ ఉన్న దేశాల లిస్టులో భారతదేశం కూడా చేరింది. భారత అంతరిక్ష ప్రయోగాలు పునాదులు పడ్డాయి. ఆ నాటి ప్రధానమంత్రి గాంధీ ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాతి సంవత్సరం 1981లో కలాంకు పద్మభూషణ్ అవార్డు దక్కింది. ఆ తరవాత మన ఆర్మీ కోసం అగ్ని, పృథ్వి, నాగ్, ఆకాశ్ త్రిశూల్ వంటి శక్తివంతమైన మిస్సైల్ లు తయారు చేసి మన దేశాన్ని ఎవరి మీద ఆధారపడని ఒక శక్తివంతమైన దేశంగా మార్చారు. అందుకే కలాంను మిసైల్ మాన్ అంటారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ఎంతో అభివృద్ధి చెందింది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి, క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు "మిస్సైల్ మాన్" అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్–%××% అణుపరీక్షలు విజయ వంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగ స్వామిగా ఆయన్ను "మిస్సైల్ మాన్" అని పిలుస్తారు. 1898లో వాజ్ పేయి ప్రధానమంత్రి సమయంలో అమెరికన్ శాటిలైట్స్ కి దొరకకుండా "పోక్రాన్" అనే ప్రదేశంలో "ఆపరేషన్ శక్తి" అనే పేరుతో విజయవంతంగా న్యూక్లియర్ టెస్ట్ చేయడంలో కలాం పాత్ర ఎంతగానో వుంది. గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగు పెట్టారు. ఆయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాం మన దేశానికి ఏ రాజకీయ అనుభవం లేకుండా పదకొండవ రాష్ట్రపతిగా ఎన్నికైన జ్ఞాని. కలాం సమయంలో ఎక్కవ మందిని కలుసుకున్న రాష్ట్రపతిగా, పీపుల్స్ ప్రెసిడెంట్ అని అంటారు. అబ్దుల్ కలాం గారు పెళ్లి చేసుకోలేదు. అంతేకాదు, వైద్య రంగంలో పోలియో బాధితుల కోసం, తేలికపాటి పరికరాల రూపకల్పన చేయడానికి ఎంతో కృషి చేశారు. భారత ప్రభుత్వం "భారతరత్న"" "పద్మవిభూషణ్", "పద్మభూషణ్" పురస్కారాలతో గౌరవించింది. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. మత ఘర్షణలను నిరసించే శాంతి కాముకుడిగా పేరు గడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. 84 సంవత్సరాల వయసులో జూలై 27, 2015 సోమవారం సాయంత్రం షిల్లాంగ్‌లోని ఏఐఎంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం మధ్యలో కుప్పకూలి పోయి, స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించబడి, 45 నిమిషాల వ్యవధిలోనే కన్నుమూశారు.

# దేవ దేవుని ఆశీస్సులు రాష్ట్రంపై మెండుగా ఉండాలి


- భగవంతుని సేవలో అందరం పాలుపంచుకుందాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో సుభిక్ష రాష్ట్రంగా రూపొందాలి
- టీటీడీ నిత్యాన్నదాన పథకానికి కూరగాయల అందజేత
- దాతలను అభినందించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




విజయవాడ, మహానగర్

సమాజంలో వివిధ వర్గాల వారు భగవంతుని అనుగ్రహం కోసం చేస్తున్న ఆరాధనతో సమానమైన సంతృప్తి లక్షలాది మందికి అన్న ప్రసాదం అందిస్తున్న స్వామివారి నిత్య అన్నదాన పథకానికి కూరగాయలు అందించడంలో కూడా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రాజీవ్ గాంధీ హోల్సేల్ కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కరెన్సీ నగర్ లోని క్యాంపు కార్యాలయం వద్ద నుంచి బయలుదేరిన వాహనానికి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో అధికారం చేపట్టిన ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంపై దేవ దేవుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో ప్రజానీకం సుఖ సంతోషాలతో జీవించేలా వెంకటేశ్వర స్వామి కరుణాకటాక్షాలు పొందేలా సుపరిపాలన అందించేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న ప్రతి పనిలోనూ భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉంటాయన్నారు. పదిమంది మేలు కోసం పనిచేసే ప్రతి ఒక్కరిపై భగవంతుడు అనుగ్రహం ఉంటుందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రాణాలను కాపాడింది కూడా వెంకటేశ్వరుడేనని గుర్తు చేశారు. అంతటి మహిమాన్వితమైన దేవుని సన్నిధిలో లక్షలాది మందికి నిత్యాన్నదానం నిర్వహిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి అందిస్తున్న సేవలలో రాష్ట్రంలో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని అభిలషించారు. భక్తులు స్వామివారి ప్రసాదాన్ని సాక్షాత్తు శ్రీ వెంకటేశ్వరస్వామి వారే భక్తుల కోసం పంపినట్టుగా భావించే స్థలంలో ఆహారం స్వీకరించేందుకు ప్రతి భక్తుడు ఇష్టపడతారన్నారు.
ఇటువంటి సేవలకు సహాయ సహకారం అందిస్తున్న సత్యదేవ వెజిటబుల్స్ నిర్వాహకులను అభినందించారు. ధార్మిక కార్యక్రమాల నిర్వాహకులు మరడ నాగేంద్ర (నాగు) మాట్లాడుతూ దివంగత ధార్మికవేత్త మండవ కుటుంబరావు 2004లో ప్రారంభించిన ఈ మహోజ్వల కార్యక్రమం ఆయన మరణానంతరం ఎంతోమంది సేవాతత్పరుల దాతృత్వంతో నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి ఉండే మత విశ్వాసాల ఆధారంగా వారి వారి విశ్వాసాల ప్రకారం భగవదనుగ్రహం పొందడం కోసం చేసే సేవలలో ఆహారం పంపిణీ చాలా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఇటువంటి సేవలు అందించేందుకు ఆర్థిక శక్తితో పాటు భగవంతుని అనుగ్రహం కూడా ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు ఎంతోమంది దాతలు తనతో కలిసి రావడం భగవదనుగ్రహమేనన్నారు. లక్షలాది మందికి ప్రతిరోజు ఆహారాన్ని అందించడం ఎంతో కష్టమైన సేవ అని, అటువంటి సేవలో తమలాంటి స్వామి వారి భక్తులు కూడా పాల్గొనేందుకు అవకాశం కల్పించిన తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప ట్రావెల్స్ అధినేత చిట్టిబాబు, మండవ శ్రీనివాస్, బి. దుర్గాప్రసాద్, ఆర్. సోమేశ్వరరావు, శీలంశెట్టి చిన్న, వర్రె అప్పారావు, ద్వారకానాథ్, మేడిచర్ల వెంకట్రావు తదితరులతో సహా పలువురు ధార్మిక, వాణిజ్య రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

## అద్భుతమైన ఆఫర్లతో శాంసంగ్ గెలాక్సీజెడ్ ఫోల్డ్ 6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6, వాచ్ అల్ట్రా, వాచ్ 7, బడ్స్ 3



విజయవాడ

శాంసంగ్ యొక్క ఆరవ తరం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లు, ఎకో సిస్టం ఉత్పత్తులు, గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6, గెలాక్సీ వాచ్ అల్ట్రా, వాచ్ 7, బడ్స్ 3.. ఇప్పుడు వినియోగదారులకు సమీపంలోని రిటైల్ అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉన్నాయి. వినియోగదారులు శాంసన్ డాట్ కామ్, అమెజాన్ డాట్ ఇన్, ఫ్లిప్ కార్ట్ లో కూడా ఈ ఉపకరణాలను కొనుగోలు చేయవచ్చు. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6లను కొనుగోలు చేసే కస్టమర్‌లు గెలాక్సీ జెడ్ అస్యూరెన్స్‌ని పొందుతారు. ఇందులో వారు పరిశ్రమలో మొదటి రెండు స్క్రీన్, భాగాల భర్తీని కేవలం రూ. 2999కి పొందుతారు.

## ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కో-చైర్‌పర్సన్‌గా బన్సీధర్ బండి

విజయవాడ




స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్, బన్సీధర్ బండి, 2024-25 సంవత్సరానికి గానూ అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కో-చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన అసోచామ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సంయుక్త సమావేశంలో ఈ నియామకం వెల్లడించారు. తన నియామకం గురించి బండి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ చాప్టర్ కు కో-చైర్‌పర్సన్‌గా నియమించబడడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. తన సహచర కౌన్సిల్ సభ్యులు, పరిశ్రమ సహచరులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు.

## వీరుల త్యాగాలను ఎన్నటికీ మరువరాదు




భీమవరం, మహానగర్

దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలు నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని దేశానికి సేవలు అందించాలని బిజెపి జాతీయ నాయకులు పాక సత్యనారాయణ పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ 25వ వార్షికోత్సవ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్గిల్ వీరులకు సత్కారం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాక సత్యనారాయణ మాట్లాడుతూ యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. అందువల్లే యువతని చైతన్యం చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనేక కార్యక్రమాలు చేపట్టారని యువత దాన్ని గమనించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణమరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి ఏట కార్గిల్ వీరులను సత్కరించటం జరుగుతుందని ఆయన వివరించారు. విద్యార్థి యువత వారిని ఇన్స్పిరేషన్ గా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కార్గిల్ వారిలో స్వయంగా పాల్గొన్న హవల్దారుగా పనిచేసిన పి. ప్రభాకర్ రావు, మాజీ సైనికుల సంఘానికి చెందిన సిహెచ్ నాగరాజు ,బి బోడకం, ఎస్.కె శ్రీనివాస్ ,ఎం శ్యాంబాబు, జి రాంప్రసాద్, టి అబ్రహం రాజు, సిహెచ్ రమేష్ లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి నాయకులు పేర్చర్ల సుభాష్ రాజు, సాయి దుర్గరాజు, అడబాల శివ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, కపర్ది, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## ఒలింపిక్స్‌లో మన ఆటగాళ్లు సత్తా చాటాలి




చల్లపల్లి, మహానగర్

జీవితంలో ఒక్కసారైనా పోటీపడాలని ప్రతి క్రీడాకారుడు కలలు కనే విశ్వ క్రీడా సంబరం పారిస్ లోని ప్రఖ్యాత సెన్ నదీ తీరంలో వినూత్న రీతిలో శుక్రవారం ప్రారంభమైన సందర్భంగా స్థానిక శ్రీ విజయ అకాడమీ సంబరాలు అంబరాన్ని అంటాయి. భారతదేశం నుంచి ఒలంపిక్స్ ఆటల్లో పతకాల కోసం పోటీ పడుతున్న 117 మంది అథ్లెట్లు ఘన విజయం సాధించాలని ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు ఆకాంక్షించారు. జాతీయ జెండా చేతబూని విద్యార్థినీ విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఒలంపిక్స్ చిహ్నాన్ని ప్రతిబింబించేలా ఐదు రంగుల బెలూన్లతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు, పీఈటీ టి.అర్జునరావు, ఎంకోటయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 19 నుంచి 27 వరకు ఆకాష్ టాలెంట్ టెస్ట్







- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో 26 రాష్ట్రాలు, యూటీల్లో నిర్వహణ
- ప్రతిభ కనబరిచినవారికి 100 శాతం స్కాలర్‌షిప్పులు, నగదు బహుమతులు
- ఆకాష్ అకాడమీ డైరెక్టర్ నరేష్ వెల్లడి

విజయవాడ

అక్టోబర్ 19 నుంచి 27వ తేదీ వరకు ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్ (ఏఎన్‌టీహెచ్‌ఈ) నిర్వహించనున్నట్లు ఆకాష్ అకాడమీ డైరెక్టర్ సిహెచ్ నరేష్ తెలిపారు. దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పరీక్షను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆఫ్‌లైన్‌లో అక్టోబర్ 20, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా 315 సెంటర్లలో నిర్వహిస్తామని, ఆన్‌లైన్‌లో అక్టోబర్ 19 నుంచి 27వ తేదీ వరకు పరీక్షను విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న ప్రాంతం నుంచే పరీక్ష రాసేందుకు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఏడో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయవచ్చని చెప్పారు. విజయవాడలోని ఆకాష్ అకాడమీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) 15 ఏళ్లుగా ఏఎన్‌టీహెచ్‌ఈని నిర్వహిస్తుందని తెలిపారు. గత ఏడాది పరీక్షకు రికార్డు స్థాయిలో 11.8లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఈ ఏడాది ఏఎన్‌టీహెచ్‌ఈలో ప్రతిభ కనబరిచిన 7 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల్లో 100 మందికి, 11 నుంచి 12వ తరగతి వరకు 50 మంది విద్యార్థులకు నీట్, జేఈఈ, ఐఐటీ వంటి ఎక్కువగా పోటీ ఉండే ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలకు 100శాతం స్కాలర్‌షిప్‌తో అవసరమైన శిక్షణ ఇస్తామని, నగదు బహుమతి అందిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది ఏఎన్‌టీహెచ్‌ఈని ప్రారంభించి 15ఏళ్లు అయిన సందర్భంగా మొదటి ఐదు స్థానాల్లో నిలిచినవారిని ఆకాష్ అకాడమీ సొంత ఖర్చులతో అమెరికాలోని నాసా అనుబంధ సంస్థ జాన్ ఎఫ్ కెనడీ స్పేస్ సెంటర్ సందర్శనకు పంపిస్తామని చెప్పారు. గత ఏడాది ఈ విధంగా శిక్షణ పొందిన విద్యార్థులు నీట్, జేఈఈ, ఐఐటీ వంటి అత్యంత తీవ్ర పోటీ ఉన్న పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ ఏడాది టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష రాసేందుకు రూ.200 ఎంట్రీ ఫీజు, ఆగస్టు లోపు స్లాట్ బుకింగ్ చేసుకున్నవారికి రూ.100 మాత్రమే అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చెసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆకాష్ అకాడమీ ఆపరేషన్స్ హెడ్ అర్జున్ వడ్డే, ఏరియా బిజినెస్ హెడ్ రవికిరణ్ బ్రాంచ్ హెడ్ శేషుదాసు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి

విజయవాడ, మహానగర్



ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు, పశ్చిమ నియోజకవర్గంలోని ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తెలిపారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా జోనల్ కమిషనర్ రమ్య కీర్తన ఇతర ప్రభుత్వ అధికారులతో కలిసి శుక్రవారం 42వ డివిజన్ లో పర్యటించారు. ప్రియదర్శిని కాలనీ హెచ్ బి కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రియదర్శిని కాలనీ నుంచి హెచ్ బి కాలనీ వరకు రహదారి అనుసంధానం చేయాలని తాగునీటి పైపులకు లీకులు ఏర్పడి నీరు వృధా అవుతుందని తాగు నీటి వాటర్ ట్యాంకుకు ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని స్థానిక మహిళలు కొరగా తక్షణమే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే 450 %ంట్% ఫ్లాట్లవద్ద గల పార్కులో వర్షపు నీరు పోయే మార్గం లేక నీరు నిల్వ ఉండి దోమలతో ఇబ్బంది పడుతున్నామని పార్కులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక వాసులు విన్నవించుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులను వేగవంతం చేస్తామన్నారు. జనావాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి వర్షపు నీరు నిలిచి ఉండడాన్ని జోనల్ కమిషనర్ రమ్య కీర్తన పరిశీలించి తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. హెచ్ బి కాలనీ వాసులందరూ చెత్తను పారిశుధ్య సిబ్బందికి విధిగా అందజేసి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. జనావాసాల మధ్య చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై నియోజకవర్గ అభివృద్ధిపై గత వైసిపి పాలకులు దృష్టి పెట్టలేదని ప్రత్తిపాటి శ్రీధర్ అన్నారు. స్ట్రామ్ వాటర్ పనులు రోడ్ల సైడ్ డ్రెయిన్ల నిర్మాణం 2014-2019 మధ్యకాలంలోనే జరిగిందని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య, సీతా చంద్రశేఖర్ టిడిపి డివిజన్ ప్రెసిడెంట్ ముదిరాజ్ శివాజీ, పి సాంబశివరావు, జనసేన డివిజన్ ప్రెసిడెంట్ తిరుపతి అనూష, జనసేన ప్రచార కమిటీ అర్బన్ కోఆర్డినేటర్ తిరుపతి సురేష్, బిజెపి మండల అధ్యక్షులు పగడాల కృష్ణ, ఏఈ అహ్మద్, ఏఈ రవీంద్ర, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, శానిటరీ ఇన్స్పెక్టర్ బ్రహ్మారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సీబీసీఐడీకి డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసు

- విచారణకు ఆదేశించిన సీఎం చంద్రబాబు
- వెల్లడించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్





అవనిగడ్డ, మహానగర్

నాలుగేళ్ల క్రితం ఎంతో సంచలనం సృష్టించిన డాక్టర్ కోట శ్రీహరిరావు హత్య కేసు విచారణను ప్రభుత్వం సీబీసీఐడీకి అప్పగించినట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ శు క్రవారం తెలిపారు. నాలుగేళ్ల క్రితం ఎంతో సంచలనాత్మకంగా మారిన ఈ కేసును పోలీసులు ఛేదించలేకపోయారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్ళగా వారు వెంటనే స్పందించి సిబిసిఐడి విచారణకు ఆదేశించారని చెప్పారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు దృష్టికి తీసుకువెళ్లగా వారు సిబిసిఐడి విచారణ వేగవంతంగా జరిపిస్తామని చెప్పారని తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలను ఎంతో భయభ్రాంతులకు గురిచేసిన ఈ హత్యను సిబిసిఐడి వారు ఛేదిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ ప్రజలు ఈ హత్య మీద చాలా ఆవేదనతో ఉన్నారని, ఈ హత్య అనంతరం అవనిగడ్డలో కొంతకాలం పాటు రాత్రి వేళ తలుపులు తీయడానికి కూడా సాహసించని పరిస్థితిని అవనిగడ్డ ప్రజలు ఎదుర్కొన్నారని అన్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారానికి అవనిగడ్డ వచ్చిన పవన్ కళ్యాణ్ దృష్టికి అవనిగడ్డ ప్రజలు ప్లకార్డు ద్వారా డాక్టర్ కోట శ్రీహరిరావు హత్య కేసును తీసుకువెళ్లి విచారణ కోరినట్లు తెలిపారు. డాక్టర్ కోట శ్రీహరి రావు హత్య ప్రతి ఒక్కరి హృదయాలను ఆవేదనకు గురి చేసినప్పటికీ పోలీసులు ఎందుకు ఈ కేసును ఛేదించలేకపోయారనే అనుమానాలు, ఆవేదన ఉన్నాయన్నారు. నేర రహిత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దృష్టికి విషయాన్ని ఈ హత్య విషయం తీసుకు వెళ్లిన వెంటనే స్పందించి సిబిసిఐడి విచారణకు ఆదేశించడం పట్ల ప్రత్యేకంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇకముందు ఇలాంటి హత్యలు ఎక్కడా జరగడానికి వీల్లేదని, ఒకవేళ జరిగినా పోలీసులు స్పష్టంగా విచారణ చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా శాసనసభలో ఇదే విషయాన్ని సభ దృష్టికి తీసుకు వచ్చారని చెప్పారు. రాష్ట్రంలో నాలుగున్నర ఏళ్లుగా శాంతిభద్రతలు కరువైన పరిస్థితి పునరావృతం కాకూడదని, ఎలాంటి నేరాలు జరగకుండా శాంతి భద్రతలు నెలకొల్పేలా రాష్ట్రం ఉండాలని చంద్రబాబు చెప్పారన్నారు. డాక్టర్ కోట శ్రీహరి రావు హత్య ఎవరు చేశారు? ఎందుకు చేశారు? అనే విషయం నాలుగేళ్లుగా తేలక పోవటంతో తప్పనిసరి పరిస్థితుల్లో సిబిసిఐడి విచారణకు సీఎం చంద్రబాబు, డీజీపీ ఆదేశాలు జారీ చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కోట శ్రీహరిరావు హత్య సమాచారం ఎవరి దగ్గర ఉన్నా సిబిసిఐడికి అప్పగించి కేసు విచారణ వేగవంతంగా జరిగేలా సహకరించి ఆయన ఆత్మ శాంతి చేకూర్చాలని కోరారు.

## కష్టకాలంలో ఆదుకోవడమే మానవత్వం



భీమవరం, మహానగర్

స్థానిక మెంటే వారి తోట 2వ వార్డులో అధిక వర్షాలకు ముంపుకు గురైన బాధితులకు శుక్రవారం శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వివేకానంద సేవా సమితి సహకారంతో రగ్గులు, పుస్తకాలు, గ్లాస్ లను జిల్లా కలెక్టరు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి జీవనం కష్టంగా ఉన్న తరుణంలో, వరద కారణంగా కష్టకాలంలో వున్న బాధితులను ఆదుకున్నప్పుడే మానవత్వం అందరికీ ఆదర్శవంతం అవుతుందన్నారు. 10 ఏళ్లుగా వివేకానంద సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినంద నీయమని, భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి డ్రైయిన్ పై రక్షణ గోడ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వివేకానంద సేవా సమితి సహకారంతో రగ్గులు, పుస్తకాలు, గ్లాస్ లను జిల్లా కలెక్టరు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి జీవనం కష్టంగా ఉన్న తరుణంలో, వరద కారణంగా కష్టకాలంలో వున్న బాధితులను ఆదుకున్నప్పుడే మానవత్వం అందరికీ ఆదర్శవంతం అవుతుందన్నారు. 10 ఏళ్లుగా వివేకానంద సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినంద నీయమని, భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి డ్రైయిన్ పై రక్షణ గోడ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

## సైనికుల త్యాగాలు అజరామరం

**న్యూఢిల్లీ :** భారత్–పాకిస్థాన్ మధ్య 60 రోజుల పాటు కార్గిల్ యుద్ధం జరిగింది. పాకిస్థాన్ సైన్యం రహస్యంగా కార్గిల్ కొండలను అధిరోహించింది. భారత భూభాగం లోని 15 వేల అడుగుల ఎత్తైన కార్గిల్ శిఖరాలను పాక్ సైనికులు స్వాధీనం చేసుకున్నారు. కానీ భారత సైనికులు, అలుపెరగని ధైర్యాన్ని ప్రదర్శించి, పాక్ సైనికుల ఆక్రమణ నుండి కార్గిల్‌ను విడిపించారు. మాతృ భూమి రక్షణ కోసం జరిగిన కార్గిల్ యుద్ధంలో 500 మందికి పైగా ధీరులు అమరులయ్యారు. భారత సైనికుల జ్ఞాపకార్థం ఇక్కడ స్మారక చిహ్నం నిర్మించడం జరిగింది.కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకుని అమరవీరులకు నివాళులర్పించారు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ. 1999వ సంవత్సరంలో ఇదే రోజున భారత సైన్యానికి చెందిన వీర సైనికులు పాకిస్థాన్‌పై విజయం సాధించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా పేర్కొన్నారు."ఈరోజు కార్గిల్‌విజయ్‌కి 25సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇది భారతదేశ చరిత్రలో నిర్ణయాత్మక ఘట్టం. పాకిస్తాన్ సైనికులు భారత భూభాగంలోకి లోతుగా చొరబడ్డారు, దీంతో భారత్ ఆపరేషన్ విజయ్‌ను ప్రారంభించింది. భారత సైన్యం భీకర పోరాటాలు చేసింది. ప్రతి అంగుళం భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంది. మన దేశ సమగ్రతను కాపాడింది. అటువంటి యుద్ధభూమి టైగర్ హిల్, ఇది యుద్ధం అత్యంత తీవ్రమైన పోరాటాన్ని చూసే వ్యూహాత్మక వాన్టేజ్ పాయింట్. జూలై 4, 1999న, కనికరంలేని, రక్తపాత యుద్ధం తర్వాత, టైగర్ హిల్‌పై భారత బలగాలు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ విజయం జూలై 26, 1999న భారత భూభాగం నుండి పాకిస్తాన్ చొరబాటుదారులను తుదముట్టించడానికి మార్గం సుగమం చేసింది. కార్గిల్ యుద్ధం ముగుస్తున్న తరుణంలో, సైనికులు వారికి మద్దతుగా నిలిచిన నాయకుల అచంచలమైన స్ఫూర్తికి సంబంధించిన మరో గాథ లిఖించబడుతోంది." అంటూ ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.కార్గిల్ యుద్ధంలో అమరులైన భారత సైనికుల జ్ఞాపకార్థం ఇక్కడ స్మారక చిహ్నం నిర్మించారు. ఇది భారత సైనికులకు అంకితం చేశారు. ఇక్కడ అమర కాంతి వనంతోపాటు వీరోచిత పోరాటం చేసిన సైనికుల జీవిత గాథలు, శాసనాలు, వారి విగ్రహాలను ఏర్పాటు చేశారు.

## భారత్‌లో ఏటా 2.5 శాతం పెరుగుతున్న క్యాన్సర్ కేసులు

భారత్‌లో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో క్యాన్సర్ రోగులకు అందుబాటు ధరలో చికిత్స, మందులు అందించేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా లోక్‌సభకు తెలిపారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన జేపీ నడ్డా భారత్‌లో ఏటా క్యాన్సర్ కేసులు 2.5 శాతం పెరుగుతున్నట్లు వెల్లడించారు. పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు, మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నట్లు చెప్పారు. దేశంలో ఏటా 15.5 లక్షల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నట్లు సభకు వివరించారు. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో క్యాన్సర్ చికిత్స కోసం వినియోగించే మందుల ధరలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు నియంత్రిస్తోందని తెలిపారు. ప్రభుత్వం విధించిన ధరల పరిమితి కారణంగా రోగులకు ఏటా రూ.294 కోట్లు ఆదా అవుతోందన్నారు. ఇక హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై సభ్యులు అడిగిన మరో ప్రశ్నకు నడ్డా స్పందిస్తూ.. ఈ విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందని చెప్పారు. ఎక్కువ మంది వైద్యులు ఉండేలా మెడికల్ కాలేజీల విస్తరణ జరుగుతోందని వివరించారు. వైద్య విద్య యొక్క నాణ్యత, పరిమాణంలో సమతుల్యత ఉండాలన్నారు. 2014లో మెడికల్ కాలేజీల సంఖ్య 387 ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 731కి పెరిగినట్లు చెప్పారు. ఇక అదే సమయంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 51,348 సీట్ల నుంచి 1,12,112 (1.12 లక్షలు)కి పెరిగిందని నడ్డా సభకు తెలియజేశారు. వైద్య విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు 2014లో 31,185 ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 72,627కు పెరిగినట్లు వివరించారు.

## దిగివస్తున్న పసిడి ధరలు

కస్టమ్స్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర బడ్జెట్ 2024–25లో కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో బంగారం ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. బడ్జెట్ ప్రకటన వెలువడిన మూడు రోజుల్లో 10 గ్రాముల పసిడి ధర ఏకంగా 7 శాతం లేదా రూ.5000 మేర దిగివచ్చింది. దేశ రాజధాని ఢిల్లీలో రూ.75,000 ఎగువన ఉన్న 10 గ్రాముల బంగారం ధర బడ్జెట్ ప్రకటన తర్వాత రూ.70,650 స్థాయికి తగ్గింది. ఇక కిలో వెండి ధర కూడా రూ.84,000 స్థాయికి పడిపోయింది. ధరలు తగ్గుదలను కొనుగోలుదారులు కూడా స్వాగతిస్తున్నారు. ధరలో గణనీయమైన తగ్గుదల కనిపిస్తుండడంతో ఆభరణాల కొనుగోలు డిమాండ్ కూడా పెరిగింది. తిరిగి బంగారాన్ని కొనేందుకు కస్టమర్లు మొగ్గుచూపుతున్నారు. ఆభరణాలు కొనుగోలు చేసే కస్టమర్ల సంఖ్య పెరుగుతోందని వ్యాపారులు చెబుతున్నారు. పండగల సీజన్‌కు ముందు ధరల తగ్గుదల తమకు కలిసి రావడం ఖాయమని, ఆభరణాల విక్రయాలకు మరింత ఊతం ఇస్తుందని పీసీ జ్యువెలర్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ గార్గ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కస్టమ్స్ సుంకం తగ్గింపుతో బంగారం దిగుమతులు చౌకగా మారాయి. ఈ నిర్ణయం బంగారం అక్రమ రవాణాకు కూడా అడ్డుకట్ట వేయగలదనే అంచనాలున్నాయి.

## శ్రీకాకుళేశ్వర స్వామికి తెనాలి భక్తుల విరాళం

- రూ.2.25లక్షల విలువైన బంగారు బొట్లు సమర్పించిన భక్తులు



ఘంటసాల, మహానగర్

మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానానికి తెనాలి చినరావూరుకు చెందిన భక్తులు వి.నిరంజనరావు దంపతులు సుమారుగా రూ.2.25 లక్షలు విలువైన రాళ్లతో కలిగిన బంగారపు బొట్లను శుక్రవారం సమర్పించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి బంగారుబొట్లను అర్చకులకు అందించారు. వారిని ఆలయ సిబ్బంది సత్కరించారు.

## తిరుపతి డీఎంహెచ్‌ఓపై చర్యలు తీసుకోవాలి




విజయవాడ

తిరుపతి డీఎంహెచ్‌ఓ శ్రీహరిపై చర్యలు తీసుకోవాలని సమతా సైనిక్ దళ్ నాయకులు డిమాండ్ చేశారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్ర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సురేందర్ మాట్లాడుతూ, వివాదాస్పదుడిగా పేరున్న తిరుపతి డీఎంహెచ్‌ఓ శ్రీహరిపై అనేక అవినీతి ఆరోపణలున్నాయని అన్నారు. శ్రీహరిపై అనేక చార్జ్ మెమోలు పెండింగులో ఉన్నాయని, ప్రభుత్వం తక్షణం శ్రీహరి వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎస్డీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరంజీవి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఆరే కళ్యాణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## వ్యవస్థలను నిర్వీర్యం చేశారు

### కాషాయ పాలకులపై అఖిలేష్ యాదవ్ ఫైర్

యూపీ మాజీ సీఎం, ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ కాషాయ పాలకులు లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. బీజేపీ నేతలు ప్రతి వ్యవస్థనూ నిర్వీర్యం చేశారని, ప్రతి విభాగాన్నీ ధ్వంసం చేశారని ఆరోపించారు. ఢిల్లీ వైఫైకి యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య పాస్‌వర్డ్‌లా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాన్ని ఇలాగేనా నడిపేదని ఆయన ప్రశ్నించారు. యూపీని ఇలా పాలించరాదని పేర్కొన్నారు. కాషాయ పాలకులు యూపీ ప్రజలను మోసగిస్తున్నారని మండిపడ్డారు. ఎస్పీ ప్రజలకు జవాబుదారీగా ఉంటుందని, తమ పార్టీ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు.మరోవైపు కేంద్ర బడ్జెట్‌పై టీఎంసీ ఎంపీ శత్రుఘ్న సిన్హా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.కేంద్ర బడ్జెట్‌లో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలను సంతృప్తి పరిచేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారని, తెలంగాణ, పంజాబ్, హరియాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి పలు రాష్ట్రాలను విస్మరించారని మండిపడ్డారు. బెంగాల్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, ఇది కేవలం కుర్చీని కాపాడుకునే బడ్జెట్ మాత్రమేనని దుయ్యబట్టారు.అగ్నివీర్ పథకంపై ప్రధాని మోదీ ప్రకటనను ప్రస్తావిస్తూ ఇది యువతకు వారి కుటుంబాలకు ఎలాంటి మేలు చేసే పథకం కాదని విమర్శించారు. ఇక దేశంలో అత్యంత ప్రముఖ నేతల్లో మమతా బెనర్జీ ఒకరని అనడంలో ఎలాంటి సందేహం లేదని శత్రుఘ్న సిన్హా పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో మమతా బెనర్జీ తన గళాన్ని గట్టిగా వినిపిస్తారని చెప్పారు.

## ప్యానల్ స్పీకరుగా బాధ్యతలు నిర్వహించిన బుద్ధప్రసాద్

అవనిగడ్డ, మహానగర్



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శు క్రవారం మధ్యాహ్నం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో ప్యానల్ స్పీకరుగా బాధ్యతలు నిర్వర్తించారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ మేరకు ఆయనకు బాధ్యతలు అప్పగించి విశ్రాంతికి వెళ్లగా, బుద్ధప్రసాద్ సభ నిర్వహించారు. అప్పటికే సభలో ప్రసంగించేందుకు సిద్ధంగా ఉన్న పితాని సత్యనారాయణ ఈ సందర్భంగా ప్యానల్ స్పీకర్ అధ్యక్షులకు అభినందనలు అంటూ బుద్ధప్రసాదుకు శుభాకాంక్షలు తెలిపారు. బుద్ధప్రసాద్ గత టీడీపీ ప్రభుత్వంలో నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి అసెంబ్లీకి డిప్యూటీ స్పీకరుగా బాధ్యతలు నిర్వహించారు.

## ఆశ్రమాల్లో వృద్ధులకు సహాయం



చల్లపల్లి, మహానగర్

బీసీ ప్రముఖుడు వేముల అర్జునరావు వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కుమార్తె హిమవర్ష పుట్టినరోజు సందర్భంగా సీయోను వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, మాజీ వార్డు సభ్యుడు వేముల హరికృష్ణ, పెద్దలు వేముల శేషగిరిరావు, చంద్ర నానిబాబు, యన్నం చంద్రయ్య, సలీం, రమేష్, వేముల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య జయంతి

ఘంటసాల, మహానగర్



చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య 109వ జయంతి వేడుకలు శుక్రవారం ఘంటశాల గ్రామ పంచాయతీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ప్రగడ కోటయ్య విగ్రహానికి కోస్తాంధ్ర పద్మశాలి సంఘ ప్రధాన కార్యదర్శి అందే జగదీష్, చేనేత కార్మికులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జగదీష్ మాట్లాడుతూ చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య చేనేతల కోసం చేసిన ఉద్యమాలు, త్యాగాలను గుర్తుచేసుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్ళడానికి కృషి చేయాలని కోరారు. వృద్ధ చేనేత కళాకారులు కేతన రామకృష్ణ, గోలి కోటేశ్వరరావులను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించి చేనేత కార్మికులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో వుడతా చిత్తరంజన్ సాయి, గుత్తికొండ సత్యనారాయణ, పోలన వాసు, బండారు నాగేశ్వరరావు, అక్కల లీలాప్రసాద్, నందం వెంకటేశ్వరరావు, నందం వెంకటేశ్వరరావు, మాచర్ల మస్తాన్, శీలం నాగమల్లేశ్వరరావు, జంజనం రామమోహనరావు, నాగరాజు, తుమ్మలచర్ల కమల, రోశారావు పాల్గొన్నారు.

## బిజినెస్

### గోల్డ్ బాండ్స్ కొనుగోలుతో బోలెడన్నీ లాభాలు



భారతదేశంలో బంగారం విని యోగం తారాస్థాయిలో ఉంటుం ది. ముఖ్యంగా ప్రపంచ దేశాలతో పోటీపడేలా భారత్‌లో బంగారం వినియోగం ఉంటుంది. ఇతర దేశాల్లో ఆభరణాల కింద తక్కువ మొత్తంలో కొనుగోలు చేసి ఎక్కువ మొత్తంలో పెట్టుబడి మార్గంగానే వినియోగిస్తూ ఉంటారు. కానీ భారతదేశంలో తరతరాలు ఆభరణాల బంగారం వినియోగం మాత్రమే అధికంగా ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం భౌతిక బంగారానికి ప్రత్యామ్నాయంగా పెట్టుబడి మార్గంగా ఉపయోగపడేలా సావరిన్ గోల్డ్ బాండ్స్‌ను అందుబాటులోకి తీసుకుని వచ్చింది. ఈ బాండ్స్ బంగారం ధర ఆధారంగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అలాగే ఈ బాండ్స్ కొనుగోలు చేస్తే వార్షిక రాబడి వస్తుంది. అలాగే బంగారం ఆభరాలు చేయించుకుంటే తరుగు, మజూరీ చార్జీలను కూడా ఆదా చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో తక్కువ కాలంలో ఈ బాండ్లు అధిక ప్రజాదరణ పొందాయి. అయితే కేంద్ర బడ్జెట్ ప్రభావంతో బంగారం ధర 10 గ్రాములకు దాదాపు మూడు వేలు తగ్గింది. అయితే ఈ బాండ్లు కొనుగోలు చేసిన వారికి ధర తగ్గడం వల్ల నష్టం లేదని నిపునులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌జీబీల వల్ల వచ్చే రాబడితో పాటు ప్రయోజనాలను తెలుసుకుందాం. ఎస్‌జీబీకు సంబంధించిన యూనిట్ ఒక గ్రాము బంగారాన్ని సూచిస్తుంది. అలాగే ఇవి పెట్టుబడి దారులకు అంతర్లీన బంగారం విలువపై ఆదాయాన్ని పొందే అవకాశాన్ని అందిస్తాయి. ఎస్‌జీబీలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తుంది. అలాగే పెట్టుబడిదారులకు జారీ చేసిన బాండ్ ముఖ విలువలో 2.5 శాతం వడ్డీ ఆదాయాన్ని అందిస్తాయి. అందువల్ల భౌతిక బంగారంపై పెట్టుబడితో పోల్చితే ఎస్‌జీబీలు మెరుగైన లాభాన్ని అందిస్తాయి.

### వేతన పెంపు ఈ త్రైమాసికంలోనే




ముంబయి: ఐటీ సేవల సంస్థ టెక్ మహీంద్రా, ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.851 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023–24 ఇదే కాల లాభం రూ.692.50 కోట్లతో పోలిస్తే ఇది 23% ఎక్కువ. కార్యకలాపాల ఆదాయం రూ.13,159 కోట్ల నుంచి 1.2% తగ్గి రూ.13,006 కోట్లకు పరిమితమైంది. 2024–25లో కంపెనీ పనితీరు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే మెరుగ్గా ఉంటుందని టెక్ మహీంద్రా ఎండీ, సీఈఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మోహిత్ జోషి తెలిపారు. మొత్తం వ్యయాలు 2.3% తగ్గి రూ.955 కోట్లకు పరిమితమయ్యాయి. వడ్డీ వ్యయాలు 40% దిగి వచ్చి రూ.715 కోట్లుగా నమోదయ్యాయి. ఈ వ్యయాలు తగ్గడం వల్లే సంస్థ లాభం పెరిగింది. ప్రస్తుత త్రైమాసికం (జులై–సెప్టెంబరు)లో తమ 1.47 లక్షల మంది ఉద్యోగులకు వేతనాలు పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు జోషి తెలిపారు. నిర్వహణ లాభాల మార్జిన్ 1.9% పెరిగి 12 శాతానికి చేరింది. ముమ్ముందు ఇది మరింతగా పెరగొచ్చని అంచనా వేస్తున్నట్లు జోషి తెలిపారు. సమీక్షిస్తున్న త్రైమాసికంలో 534 మిలియన్ డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకున్నామని తెలిపారు. మార్చి త్రైమాసికంలో ఈ విలువ 500 మిలియన్ డాలర్లు కాగా.. 2023–24 ఏప్రిల్– జూన్‌లో 359 మిలియన్ డాలర్ల ఆర్డర్లను కంపెనీ దక్కించుకుంది. కొత్త ఆర్డర్ల ఎంపిక విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నామని చెప్పారు. ఏప్రిల్– జూన్‌లో కొత్తగా 2,165 మందిని చేర్చుకోవడంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 1.47 లక్షలకు చేరింది. వలసల రేటు 10.1 శాతంగా ఉంది. మార్చి త్రైమాసికంతో పోలిస్తే 2.7% తగ్గింది.

## ఎల్ఐసీ పాలసీని మధ్యలో ఆపేశారా..
# ఇలా చేస్తే నగదు వాపస్

జీవిత బీమా రంగ దిగ్గజం భారతీయ జీవిత బీమా సంస్థ తన కస్టమర్లకు ఎన్నో రకాల సేవలను అందిస్తోంది. టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న తరుణంలో రకరకాల ఫీచర్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. గతంలో పాలసీదారులు తాము కడుతున్న పాలసీకి సంబంధించి ఏదైనా సమాచారం తెలుసుకోవాలంటే దగ్గరలోని ఎల్?ఐసీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. అయితే మొబైల్‌లోనే ఎల్ఐసీ సర్వీసులను అందించే.. విధంగా ఎల్?ఐసీ వాట్సాప్ సర్వీసుల్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. కాగా పాలసీని మధ్యలో నే ఆపేస్తే..ఆ నగదును తిరిగి ఎలా రాబట్టుకోవాలో చాలా మందికి తెలియదు. దాని గురించి వివరంగా తెలుసుకుందాం.. సాధారణంగా జీవిత బీమా పాలసీ తీసుకోవటం ఒక ఎత్తు అయితే దానిని లాప్స్ కాకుండా చూసుకోవటం మరో ఎత్తు. పాలసీ ప్రీమియం కట్టడం మధ్యలోనే ఆపేసిన సందర్భాల్లో ఎల్ఐసీ పాలసీ లాప్స్ అవుతుంది. సాధారణంగా పాలసీకి సంబంధించిన ప్రీమియం దాని గడువు తేదీ లోగా చెల్లించకపోయినా, లేదంటే గడువు తేదీకి అదనంగా ఇచ్చిన గ్రేస్ పీరియడ్ లోపు చెల్లించకపోయినా సదరు పాలసీ లాప్స్ అయిపోతుంది. దీనిని లాప్స్డ పాలసీ అంటారు. ఇలా పాలసీ లాప్స్ అయ్యిందంటే దాని నుంచి రావాల్సిన ప్రయోజనాలు నిలిచిపోతాయి. ఇప్పటివరకు కట్టిన ప్రీమియం, పడిన కష్టం వృథా అవుతుంది. అందుకే జీవిత బీమా పాలసీ తీసుకున్న వారు గడువు తేదీ లోగా ప్రీమియం కట్టడం మంచిది. గడువు తేదీ లోగా ప్రీమియం చెల్లించలేని పరిస్థితిలో కనీసం మనకు అందుబాటులో ఉన్న గ్రేస్ పీరియడ్‌లో అయినా సరే ప్రీమియం చెల్లించి పాలసీని ఫోర్స్‌లో ఉంచుకోవాలి. మరి పాలసీ లాప్స్ అయిన తర్వాత తిరిగి దాన్ని యాక్టీవ్ చేసుకోవచ్చా?అనే ప్రశ్న అందరిలో తలెత్తుతోంది. అయితే ఎలా అనేది ఇప్పుడు చూద్దాం.. ఒక్కసారి ల్యాప్స్ అయిన పాలసీని రివైవ్ చేయాలంటే, మీరు బకాయి ఉన్న ప్రీమియంలను వడ్డీతో సహా చెల్లించాలి. అలాగే కొన్ని హెల్త్ రిక్వైర్‌మెంట్స్ కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. ల్యాప్స్ అయిన పాలసీని ప్లాన్ నిబంధనల ప్రకారం రివైవ్ చేసుకోవచ్చు. ఇందుకోసం ఎల్ఐసీ కస్టమర్ కేర్ నంబర్, ఈ–మెయిల్ లేదా మీ సమీపంలోని బ్రాంచ్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. ఎల్ఐసీ సంతృప్తి పడేలా ఎల్ఐసీకి మెడికల్ డిక్లరేషన్‌ను సమర్పించాల్సి రావచ్చు.




## ఆ కారుపై ఏకంగా రూ. 3.3లక్షల తగ్గింపు.. బంపరాఫర్ మిస్ కాకండి

కారు కొనుగోలు చేయాలనుకునేవారికి ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ మారుతీ సుజుకి శుభవార్త చెప్పింది. తమ కంపెనీకి చెందిన పలు కార్లపై జూలైలో భారీ డిస్కౌంట్లు ప్రకటించింది. దాదాపు రూ.3.3 లక్షల భారీ తగ్గింపును అందజేస్తుంది. తద్వారా ఈ కార్లను కొనుగోలు చేయడానికి మంచి అవకాశం కల్పించింది. మారుతీ సుజుకీ కార్లను ఇష్టపడే వారు వివిధ మోడళ్లపై అత్యంత తగ్గింపు ధరలు పొందవచ్చు. ఫ్రాంక్స్ కారుపై రూ.85 వేలు, మారుతీ జిమ్మీపై రూ. 3.3 లక్షల డిస్కౌంట్ అందుబాటులో ఉంది. మారుతీ సుజుకి కంపెనీ తన జిమ్నీ కారుపై అతి పెద్ద డిస్కౌంట్ ను ప్రకటించింది. కారును మరింత మందికి అందుబాటులోకి తీసుకురావడానికి ఈ చర్యలు తీసుకుంది. దీనిపై దాదాపు 3.3 లక్షల తగ్గింపును అందజేస్తోంది. ఈ కారు విడుదలైన తర్వాత ఇదే అత్యంత తగ్గింపు ధర అని చెప్పవచ్చు. మారుతీ సుజుకి జిమ్నీ కారు అడ్వంచర్ చేసే వారికి, అలాగే నగర వాసులకు చాలా ఉపయోగంగా ఉంటుంది. ఆకట్టుకునే డిజైన్, మంచి పిక్ అప్ సామర్థ్యం దీనికి ప్రత్యేకతలు. గతంలో జిమ్నీ కారుపై రూ.2.50 లక్షల వరకూ తగ్గింపు ఉండేది. దానికి జూలైలో మరో రూ.80 వేలు పెంచారు. దీంతో మొత్తం 3.30 లక్షల డిస్కౌంట్ అందజేస్తున్నారు. ఈ తగ్గింపు రేంజ్–టాపింగ్ జిమ్నీ ఆల్ఫా వేరియంట్ కు ఇస్తున్నారు. ఈ కారు కొనుగోలు చేసిన వారికి రూ.1.80 లక్షల వరకూ నగదు తగ్గింపు ఉంటుంది. అలాగే సుజుకీ ద్వారా ఫైనాన్స్ తీసుకునే వారికి మరో రూ.1.50 లక్షలను అదనంగా తగ్గిస్తారు. దీంతో మొత్తం 3.30 లక్షల తగ్గింపు ధరకు జిమ్నీని సొంతం చేసుకోవచ్చు. అయితే మీ ప్రాంతం, డీలర్ షిప్ నిబంధనలకు అనుగుణంగా ఈ తగ్గింపులు మారుతూ ఉంటాయి. అలాగే జీటా వేరియంట్ కూడా నమ్మలేని తగ్గింపు ధరకు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చింది.




## టీమిండియా శిబిరంలోకి నెదర్లాండ్స్ ఆటగాడు

భారత్–శ్రీలంక మధ్య 3 టీ20, 3 వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ ప్రారంభం కాకముందే ఓ వెటరన్ విదేశీ ఆటగాడు టీమిండియా శిబిరంలోకి వచ్చాడు. టీమ్ ఇండియా విజయానికి సహకరించేందుకు ఈ ఆటగాడు పూర్తిగా సిద్ధంగా ఉన్నాడు. జట్టు కొత్త ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఎంపికైన ఈ ఆటగాడు శ్రీలంక పర్యటన అంతటా టీమ్ ఇండియాతోనే ఉంటాడు. టీమ్ ఇండియాలో చేరిన ఈ ఆటగాడు నెదర్లాండ్స్ మాజీ స్టార్ క్రికెటర్ ర్యాన్ టెన్ డోస్చాట్. ర్యాన్ టెన్ డొస్చేట్ టీమ్ ఇండియాలో అసిస్టెంట్ కోచ్‌గా చేరాడు. గౌతమ్ గంభీర్ తనకు ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌లు కావాలని బీసీసీఐని డిమాండ్ చేయడంతో ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌లను అందించింది. ర్యాన్ టెన్ డోస్చాట్ కాకుండా గౌతమ్ గంభీర్‌కు సహాయ కోచ్‌గా అభిషేక్ నాయర్ కూడా ఉన్నారు. శ్రీలంకలో టీమ్ ఇండియా క్యాంపులో డొస్చేట్ చేరాడు. అదే సమయంలో అభిషేక్ నాయర్ టీమిండియాతో కలిసి శ్రీలంకకు వెళ్లిపోయాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ కోసం ర్యాన్ డొస్చేట్, అభిషేక్ నాయర్ ఇద్దరూ గౌతమ్ గంభీర్‌తో కలిసి పనిచేశారు. ఇద్దరూ గౌతమ్ గంభీర్‌కు ఇష్టమైనవారిగా అభిమానులు అనుకుంటున్నారు. ఇప్పటివరకు టీమిండియాలో ప్రధాన కోచ్‌తో పాటు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లను మాత్రమే నియమించగా, ప్రధాన కోచ్‌తో పాటు ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌లను కూడా నియమించడం ఇదే తొలిసారి. ఈ ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌ల కోసం గౌతమ్ గంభీర్ బీసీసీఐని డిమాండ్ చేశాడు. ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌లుగా అతను అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డోస్చాట్ పేర్లను సూచించాడు. దానిని దీజజ× అంగీకరించింది. ఈ ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌లకు గౌతమ్ గంభీర్ ఎలాంటి బాధ్యతలు ఇస్తాడనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వన్డే క్రికెట్‌లో అసిస్టెంట్ కోచ్‌గా ర్యాన్ డోస్చెట్, టెస్టు క్రికెట్‌లో అభిషేక్ నాయర్ అసిస్టెంట్ కోచ్‌గా ఉండవచ్చని మీడియాలో వార్తలు వస్తున్నాయి.



## స్పోర్ట్స్

### పసిడి కొట్టడమే లక్ష్యం



పారిస్ ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లు తమ నమ్మకాన్ని వమ్ము చేయరని 'చెఫ్ ది మిషన్' గగన్ నారంగ్ వెల్లడించారు.ఒలింపిక్స్‌లో భారత బృందానికి అతడే ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. గతంతో పోలిస్తే అథ్లెట్ల మైండ్‌సెట్ చాలా మారిపోయిందని పేర్కొన్నారు. తాము కూడా వారిని పసిడి పతకం సాధించేలా ప్రోత్సహించినట్లు నారంగ్ వెల్లడించారు. "ఇప్పుడు మన అథ్లెట్లకు అందుతున్న ప్రోత్సాహంలో చాలా మార్పు వచ్చింది. వారి ఆలోచనా విధానం కూడా ఉన్నతస్థాయికి చేరుకుంది. గతంలో ఒలింపిక్స్ అనగానే చాలా ఆందోళనకు గురయ్యేవాళ్లం. ఇతర దేశాలతో పోలిస్తే ఆత్మవిశ్వాసం తక్కువగా ఉండేది. కానీ, ఇప్పుడు మాత్రం మైండ్‌సెట్ మారింది. వారికి పోటీ ఇచ్చేలా సమాయత్తం కావడం కలిసొచ్చే అంశం. ప్రజలు కూడా క్రీడలను ఆస్వాదించడం మొదలుపెట్టారు. వారి కోసమైనా గొప్ప ప్రదర్శన ఇవ్వడానికి అథ్లెట్లు ప్రయత్నిస్తున్నారు. కేవలం గేమ్స్‌లో పాల్గొనడమే తమ లక్ష్యంగా పెట్టుకోకుండా.. అత్యుత్తమ ప్రదర్శనతో పతకాలను సాధించేలా ముందడుగు వేశారు. ఎవరూ తమకంటే బెటర్ అని భావించడం లేదు. ఏదో ఒక పతకంతో సంతృప్తి చెందకుండా గోల్డ్ కొట్టడమే లక్ష్యంగా పెట్టుకొన్నారు. కేంద్రం నుంచి కూడా క్రీడాకారులకు ఇప్పుడు దక్కుతున్న ప్రోత్సాహం గతంలో ఎప్పుడూ చూడలేదు. గత కొన్నేళ్లుగా మద్దతు పెరుగుతూ వచ్చింది. టాప్ ప్లేయర్లు పెరిగారు. ఎలాంటి సదుపాయాలు కావాలన్నా పొందగలుగుతున్నారు. కేంద్ర క్రీడా శాఖ, శాయ్, ఐఓఏ మధ్య సహకారం బాగుంది. అథ్లెట్లకు దక్కిన ప్రోత్సాహాన్ని పతకాలుగా మారుస్తారనే నమ్మకంతో ఉన్నా. నాలుగు ఒలింపిక్స్‌లో అథ్లెట్‌గా పాల్గొన్న నేను ఈసారి బృందాన్ని నడిపించడం గౌరవంగా భావిస్తున్నా. ఇది ఎంతో బాధ్యతతో కూడుకున్నదే. ఒత్తిడిని తట్టుకొని అథ్లెట్లకు అండగా నిలుస్తా. ప్లేయర్‌గా ఒక విధమైన ఒత్తిడిని ఎదుర్కొన్న నాకు ఇది విభిన్నం.

## క్వార్టర్స్‌కు చేరిన భారత మహిళా ఆర్చరీ టీమ్

పారిస్ ఒలింపిక్స్‌ను భారత్ పాజిటివ్‌గా స్టార్ట్ చేసింది. మహిళల ఆర్చరీ టీమ్ ఈవెంట్‌లో.. భారత జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. దీంతో ఆర్చరీ బృందం క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించింది. మొత్తం 1953 పాయింట్లతో ఇండియా మహిళ ఆర్చరీ జట్టు నాలుగవ స్థానంలో నిలిచింది. బుధవారం (జులై 24) పారిస్ వేదికగా 33వ ఒలింపిక్స్ పోటీలు ప్రారంభయ్యాయి. సాకర్, రగ్బీ మ్యాచ్‌లతో విశ్వక్రీడలు గ్రాండ్‌గా స్టార్ట్ అయ్యాయి. మొత్తంగా 32 క్రీడాంశాల్లో 329 పతకాల కోసం పోరు జరగనుంది. భారత్ నుంచి ఈసారి 117 మంది అథ్లెట్లు ఒలింపిక్స్‌లో పాల్గొంటారు. గత ఒలింపిక్స్‌లో ఏడు పతకాలు గెలిచిన భారత్%ౌ% ఈసారి ఎన్ని పతకాలు గెలుస్తుందా%ౌ%? అని ఆసక్తిగా ఒలింపిక్స్‌ను తిలకిస్తున్నారు భారతీయులు. పారిస్ ఒలింపిక్స్ 33వ ఎడిషన్ జూలై 26 నుంచి ప్రారంభం కానుంది. అయితే కొన్ని పోటీలు ముందుగానే ప్రారంభమయ్యాయి.ఇందులో భాగంగా గురువారం భారత మహిళా, పురుషుల జట్లు ఆర్చరీలో పాల్గొంటున్నాయి. తొలి క్వాలిఫికేషన్ ర్యాంకింగ్ రౌండ్‌లో భారత మహిళల ఆర్చరీ జట్టు నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఆ జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించింది. భారత్‌తో పాటు దక్షిణ కొరియా, చైనా, మెక్సికోలు కూడా క్వార్టర్స్‌కు అర్హత సాధించాయి. భారత్‌కు చెందిన దీపికా కుమారి, అంకితా భకత్, భజన్ కౌర్ క్వాలిఫయింగ్ ర్యాంకింగ్ రౌండ్‌లో మంచి ప్రదర్శన చేశారు. అంకితా భకత్ 666 వ్యక్తిగత స్కోర్‌తో 11వ ర్యాంక్‌ను సాధించగా, భజన్ కౌర్ 659 వ్యక్తిగత స్కోర్‌తో 22వ, 23వ ర్యాంకుల్లో, దీపికా కుమారి 658 వ్యక్తిగత స్కోర్‌తో 22వ, 23వ ర్యాంకుల్లో నిలిచారు. దీంతో భారత్ మొత్తం స్కోరు 1983 కాగా, భారత మహిళల జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ఇప్పుడు భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్ రౌండ్‌లో జూలై 28న ఫ్రాన్స్ లేదా నెదర్లాండ్స్‌తో తలపడవచ్చు.



# చీరకట్టులో రష్మిక మందన్నా

## రంజితమే స్టెప్పులు..



ఛలో, గీతగోవిందం సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది కన్నడ సోయగం రష్మిక మందన్నా పుష్ప ది రైజ్ సినిమాతో నేషనల్ క్రష్‌గా మారిపోయిన ఈ భామకు సోషల్ మీడియాలో ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. వారిసు సినిమాలో వచ్చే రంజితమే పాటకు ఏ స్థాయిలో రెస్పాన్ వచ్చిందో తెలిసిందే. ఈ ముద్దుగుమ్మ మరోసారి రంజితమే పాటకు స్టెప్పులేసి ఔరా అనిపించింది. కేరళలో జరిగిన ఓ ఈవెంట్‌లో చీరకట్టులో క్యూట్ క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో స్టేజ్‌పై డ్యాన్స్ చేస్తుంటే చూసేందుకు రెండు కండ్లు చాలవా అన్నట్టుగా ఉన్నాయి విజువల్స్. రష్మికమందన్నా మలయాళంలో ఒక్క సినిమా కూడా చేయలేదు. అయినప్పటికీ భాషతో సంబంధం లేకుండా ఎంతగానో ప్రేమించే అభిమానులున్నారని తాజా విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. రష్మిక ప్రస్తుతం అల్లు అర్జున్-సుకుమార్ కాంబినేషన్‌లో పుష్పకు కొనసాగింపుగా వస్తున్న పుష్ప..ది రూల్ సినిమాలో నటిస్తోంది. దీంతోపాటు రాహుల్ రవీంద్రన్ డైరెక్ట్ చేస్తున్న ది గర్ల్ ఫ్రెండ్ చిత్రంలో నటిస్తోంది. మురుగదాస్, సల్మాన్ ఖాన్ కాంబినేషన్‌లో రాబోతున్న సికిందర్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ధనుష్, శేఖర్ కమ్ముల కుబేర కూడాచేస్తోంది.

## నయనతార హీరోయిన్ కాకపోతే ఏం చేసేవారో తెలుసా.. ?

నయనతార ఈ పేరు దక్షిణాది సినిమా ఇండస్ట్రీలో సుప్రసిద్ధ కథానాయికగా అందరికి సుపరిచితమే. తెలుగు,కన్నడ,తమిళ భాషల్లో బిజీగా సినిమాలు చేసే ఈ అందాలభామ దక్షిణాదిలో అత్యధిక పారితోషికం తీసుకునే కథానాయికగా పేరు తెచ్చుకుంది. ఈ క్రేజీ భామ తను హీరోయిన్ అవ్వకపోయి ఉంటే చార్టర్డ్ అకౌంటెంట్ అయ్యేదాన్ని అని ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. ఈ కేరళ కుట్టి ఇటీవల ఓ మీడియాతో మాట్లాడుతూ "..మా సొంతూరు కేరళలోని తిరువల్లా. అమ్మ ఓమనా.. నాన్న కుడియాట్టు. నాన్న ఎయిర్ ఫోర్స్ లో ఉద్యోగం చేసేవారు.నా చిన్నతనం అంతా గుజరాత్ లోని జామ్ నగర్‌లో గడిచింది. నాన్న రిటైర్ అయ్యాక మా సొంతూరు వెళ్ళిపోయాము. అక్కడే నేను ఇంగ్లీష్ లిటరేచర్ లో బి.ఏ చదువుకున్నాను. చార్టర్డ్ అకౌంటెంట్ కావాలనుకునే దాన్ని .అయితే సినిమాల్లో అడుగుపెట్టడం అనుకోకుండా జరిగిపోయింది. మా పెద్ద నాన్నకు ఒక ప్రకటన సంస్థ ఉండేది. ఆయన తరుచూ నా ఫోటోలు తీసి యాడ్స్ ఏజెన్సీలకు ఇచ్చేవారు. అలా నా ఫోటో చూసిన మలయాళి దర్శకులు ఒకరు %-%సత్యన్ అంతిక్కండ్ సినిమాలో చేయమని ఆఫర్ ఇచ్చారు. మా ఇంట్లో ఈ విషయం గురించి చెబితే నీకు ఇంట్రెస్ట్ ఉంటే చేయమని నాకే వదిలేశారు. అయిదే కొద్ది రోజులు ఆలోచించి ఆ సినిమా చేయడానికి ఓకే చెప్పేశాను. ఆ విధంగా మనసినక్కరే(2003)తో నా సినిమా కెరీర్ ప్రారంభమైంది. అప్పటికి నేను డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాను. ఆ తరువాత మలయాళి అగ్ర కథానాయకుడైన మోహన్ లాల్ తో రెండు సినిమాల్లో నటించాను.-అయ్యా అనే సినిమాతో తమిళ సినీ పరిశ్రమలో అడుగుపెట్టాను. ఆ సినిమాలో శరత్ కుమార్ హీరోగా నటించారు. తమిళంలో రెండో సినిమానే -చంద్రముఖి-. ఆ సినిమా నా కెరీర్‌లోనే మర్చిపోలేనిది. ఎందుకంటే నా కెరీర్ మలుపు తిరిగింది



# ఎన్టీఆర్‌కు ఒక్క సెకను.. నాకు 10 రోజులు

బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ వరుస సినిమాలతో బిజీగా మారారు జాన్వీకపూర్. 'దేవర'తో తెలుగు తెరకు పరిచయం కానున్న ఈ బ్యూటీ తాజాగా టాలీవుడ్, ఎన్టీఆర్‌లపై ప్రశంసలు కురిపించారు.తన తాజా చిత్రం 'ఉలర్ఝ' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'దేవర' షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు. 'తెలుగువారి పనితీరు నాకు చాలా ఇష్టం. వారు కళను, సినిమాను గౌరవిస్తారు. హుందాగా ప్రవర్తిస్తారు. కథపై నమ్మకంతో పనిచేస్తారు. ప్రస్తుతం 'దేవర'లో చేస్తున్నా. జూనియర్ ఎన్టీఆర్ ఎనర్జిటిక్ హీరో. ఆయన రాగానే సెట్‌కే కళ వస్తుంది. అందరూ ఉత్సాహంగా ఉంటారు. ఇటీవల జరిగిన షెడ్యూల్‌లో మా ఇద్దరిపై పాటను చిత్రీకరించారు. ఆయన డ్యాన్స్ వేసే వేగాన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఎన్టీఆర్ ఒక్క సెకనులో దేన్నైనా నేర్చుకోగలరు. అదే విషయాన్ని నేర్చుకోవడానికి నాకు 10 రోజులు పడుతుంది. ఆయనతో తర్వాత పాట షూటింగ్ కోసం ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేస్తున్నా. దర్శకుడు కొరటాల శివ ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. ఇంత పెద్ద ప్రాజెక్ట్‌కు ఆయన కెప్టెన్. ఏ విషయమైనా సున్నితంగా చెబుతారు. ఆయనతో కలిసి పనిచేయడం సులభం' అని అన్నారు. 'ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని నా తల్లిదండ్రులు నేర్పారు. వాళ్లతో పాటు నా అభిమానులంతా గర్వపడేలా ఉంటాను. ప్రస్తుతం సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్నాను. రిలేషన్ గురించి వెల్లడించే సమయం లేదు. ఇటీవల ఆరోగ్యపరంగా కొంచెం ఇబ్బంది పడ్డాను. ఇప్పుడే కోలుకుంటున్నా' అని జాన్వీ చెప్పారు. ఆమె నటించిన రీసెంట్ మూవీ 'ఉలర్ఝ' విడుదలకు సిద్ధమైంది.





# ఆ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినందుకు బాధపడ్డా

తెలుగు సినీ ప్రియులకు సుపరిచితురాలైన నటి టబు. ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తోన్న ఆమె తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు.తన సినీ కెరీర్ ఎలా మొదలైందో చెప్పారు. అలాగే, ఇన్నేళ్ల కెరీర్‌లో ఓ ప్రాజెక్ట్ విషయంలో తాను విచారం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, ఆ ప్రాజెక్ట్ ఎందుకు అంగీకరించానా అనే భావన కలిగిందన్నారు."నటి షబానా అజ్మీ మాకు బంధువు. ఓసారి నేను ఆమె ఇంటికి వెళ్లినప్పుడు ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు శేఖర్‌కపూర్ నన్ను చూశారు. నాతో 'దుష్మణి' సినిమా చేయాలనుకుంటున్నట్లు ఇంట్లో వాళ్లతో చెప్పారు. అప్పుడు నేను పదోతరగతి చదువుతున్నా. చదువుపై ఆసక్తి ఉండటంతో సినిమాల్లోకి రానని చెప్పా. ఆయన చాలాసార్లు అడగడంతో చివరకు అంగీకరించా. పదోతరగతి పరీక్షలు రాసి.. సినిమాకు సంతకం చేశా. ఏమైందో ఏమో తెలియదు. ఆదిలోనే అది ఆగిపోయింది. ఆ తర్వాత అదే చిత్రాన్ని సన్నీదేవోల్, మనీషా కొయిరాలాతో డైరెక్టర్ బంటీ తెరకెక్కించారు. కొంతకాలం తర్వాత శేఖర్ మళ్లీ నన్ను కలిశారు. 'ప్రేమ్'లో నటించమని అడిగారు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్నానని చెప్పా. కాకపోతే ఆయన బలవంతం చేయడంతో అంగీకరించా. సినిమాకు సంతకం చేశా. షూటింగ్ మొదలయ్యాక ఆయన సినిమా నుంచి వైదొలగారు. దాంతో దాదాపు ఐదేళ్లపాటు ఆ ప్రాజెక్ట్ చిత్రీకరించారు. ఆ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినందుకు ఎంతో బాధపడ్డా" అని టబు తెలిపారు. 'మాసుమ్', 'మిస్టర్ ఇండియా', 'ఎలిజిబెత్' వంటి చిత్రాలను శేఖర్ తెరకెక్కించారు. ఇక, టబు సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్ట్‌లు చేస్తున్నారు. ఇటీవల 'క్రూ'తో అలరించారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999